

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్



శుక్రవారం

13 నవంబర్ 2026



ప్రమాదాలకు కేరాఫ్ హోటల్

- **జాతీయ రహదారిపై ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం**
- **నిబంధనలకు విరుద్ధంగా సర్వీస్ రోడ్డు వినియోగం..?**
- **పట్టించుకోని హైవే అధికారులు.. ప్రమాదం పొంచి ఉందంటున్న వాహనదారులు**

రాజాపూర్, నవంబర్ 12 (జనంసాక్షి):
మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలోని టెర్మినల్ 44 హోటల్ జాతీయ రహదారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారి 44పై చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించేవారు రహదారికి దూరంగా ఉండాలని, మొబైల్ క్యాంటీన్లను సైతం వంద మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలని హైవే అధికారులు ఆదేశిస్తుంటారు. మరి టెర్మినల్ 44 హోటల్ విషయంలో ఆ నిబంధనలు ఎందుకు అమలు కావడం లేదని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.
ఓ పెట్రోల్ బంకులోకి వాహనాలు వెళ్లేందుకు గతంలో ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డును హోటల్‌కు వచ్చే వాహనాల రాకపోకలకు వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అదే మార్గం ద్వారా వాహనాలు నేరుగా జాతీయ రహదారిపైకి చేరుతుండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో హోటల్ నుంచి ట్రావెల్స్ బస్సులు జాతీయ రహదారిపైకి వస్తున్న సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారం కళ్లకు కనిపిస్తున్నా హైవే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీస్తున్నారు.
హైవే అనుమతులు లేకుండానే హోటల్‌కు జాతీయ రహదారిని అనుసంధానిస్తూ సీసీ రోడ్డు నిర్మించారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మరోవైపు హోటల్ మురుగునీటిని జాతీయ రహదారి పక్కనే వదులుతుండటంతో పరిసరాల్లో దుర్వాసన వ్యాపిస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి హోటల్‌కు ప్రత్యేకంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయించాలని, జాతీయ రహదారికి నేరుగా అనుసంధానించిన రోడ్డును తొలగించి ప్రమాదాలను నివారించాలని రాజాపూర్ గ్రామస్తులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

మిగతా 2లో..

గుంతతీసి వదిలేశారు...

- **మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం**
- **ప్రజల ప్రాణాలకు ప్రమాదం**



మిడ్జిల్, నవంబర్ 12 (జనంసాక్షి): గుంతలు తీసి పనులు పూర్తి చేయకుండా. వదిలేశారు మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యంతో రహదారిన వెళ్లే ప్రజల ప్రాణాలకు ఎంతో ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు పక్కన గుంతలు తవ్వి పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత ప్రాంతంలో తవ్విన గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో పాటు చుట్టూ మట్టి కుప్పలు పేరుకుపోయాయి. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే అవ కాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల ముందు మట్టిని తవ్వి అలాగే వదిలేయడంతో వ్యాపారులకు, వినియోగదారులకు కూ డా ఇబ్బందులు తప్పడం లేదు. దీనితో పాటు పేరుకుపోయిన నీరు మురుగ్గా మారి మళ్లీ మిషన్ భగీరథ వాటర్ వదిలేటప్పుడు రివర్స్ పోయి ప్రజలకు ప్రాణాని ఉందని. రోగాలు ఓకే అవకాశం మెండుగా ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో మరింత నిర్లక్ష్యంగా మారుతుందన్నారు. అభివృద్ధి పనుల పేరుతో గుంతలు తవ్వి వాటిని పూడ్చకుండా వదిలేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చి, రాకపోకలకు ఇబ్బం దులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పొగమంచుతో అప్రమత్తం... ఎస్పీ డాక్టర్ వినీత్

- **వాహనాలను నెమ్మదిగా నడపండి...సురక్షితంగా గమ్యం చేరుకోండి**



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి):
వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వాహ నదారులు అప్రమత్తంగా ఉండాలని,వీలైనంతవరకు రాత్రి వేళల్లో, తెల్లవారుజామున ప్రయాణాలను నివారించాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణం తప్పనిసరైతే వాహనాలను నెమ్మదిగా, జాగ్రత్తగా నడుపుతూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లా ప్రజలకు సూచించారు. ఇటీవల పొగమంచు కారణంగా చోటుచేసు కుంటున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో జిల్లా ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.
ముఖ్యంగా రాత్రి వేళల్లో, తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనా లు, పాదచారులు, మలుపులు సరిగా కనిపించక పోవడంతో ప్రమా దాలు జరిగే అవకాశం ఉందన్నారు. తక్కువ దూరం మాత్రమే కనిపించే పరిస్థితుల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీస్తుం దని, అత్యవసరమైతే తప్ప ఈ సమయాల్లో ప్రయాణాలు చేయవద్దని సూచించారు.
పొగమంచు ఉన్న సమయంలో వాహనాలను అతివేగంగా నడపకుండా, నియంత్రిత వేగంతో ప్రయాణించాలి. వాహనాల హెడ్ లైట్లనులో బీమ్‌లో ఉంచి, ఫాగ్ లైట్ల ను వినియోగించాలి. ముందున్న వాహనానికి తగినంత దూరం పాటించాలి.
అకస్మాత్తుగా బ్రేకులు వేయడం, ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేయడం చేయరాదు ప్రయాణానికి ముందు వాహనాల బ్రేకులు, హెడ్‌లైట్లు, టెయిల్ లైట్లు, టైర్ల పనితీరును తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలి. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియో గించరాదు. రహదారిపై పూర్తి అప్రమత్తతతో వాహనం నడపాలి.
మద్యం సేవించి వాహనాలు నడపరాదు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. పొగ మంచు మరీ ఎక్కువగా ఉండి రహదారి కనిపించని పరిస్థితుల్లో సురక్షితమైన ప్రదేశంలో వాహనాన్ని నిలిపి, పరిస్థితులు అనుకూలించిన తర్వాత ప్రయాణం కొనసాగించాలి. ప్రజల ప్రాణాల రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, వాహనదారులు పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహ రించాలని ఎస్పీ కోరారు.
ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తమ ప్రయాణాన్ని సురక్షితంగా ముగించుకోవా లని, తమ కుటుంబ సభ్యులకు క్షేమంగా చేరు కోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- **ఉపాధి హామీ పనులతో కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించాలి**
- **ఇందిరమ్మ ఇండ్లు, జలసిరి, స్వచ్ఛ భారత్ పనులపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ సిహెచ్. ప్రియాంక**



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి): జిల్లాలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వచ్చే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిహెచ్. ప్రియాంక అధికారులను ఆదేశించారు. గురు వారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ, జలసిరి, స్వచ్ఛ భారత్, తాగునీటి సరఫరా, పింఛన్లు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 45 నుంచి 50 శాతం లోటు నమోదైందని, అక్టోబర్‌లో సుమారు 96 శాతం వర్షపాతం తగ్గిందని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో నీటి అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి సమస్యలు తలెత్త కుండా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తాగునీటి సరఫరాపై పూర్తి బాధ్యత తీసుకోవాలని, అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.
వర్షాభావంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు వలస వెళ్లకుండా ఉపాధి హామీ పథకం ద్వారా స్థానికంగానే విస్తృతంగా పనులు కల్పించాలన్నారు. ప్రతి ఆవాసంలో పనులు ప్రారంభించి, కూలీల సంఖ్య పెంచాలని, రోజువారీ పనుల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. జలసిరి పనుల్లో మరికల్, మద్దూర్, కోస్గి మండలాల్లో పురోగతి పెంచాలని, ఉడ్కూర్, నర్వ, నారాయణపేట ప్రాంతాల్లో కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు.
పీఎంఏవై-జి పోర్టల్‌లో అర్హులైన లబ్ధిదారుల జాబ్ కార్డుల నమోదు పూర్తి చేయాలని, రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించాలని ఆదేశించారు. మొదటి దశ ఇళ్ల నిర్మాణాలను కూడా వేగవంతం చేయాలన్నారు. చేయూత పింఛన్ల దరఖాస్తులను, ముఖ్యంగా దివ్యాంగుల పింఛన్లను సమగ్రంగా పరిశీలించి అర్హత నిర్ధారించిన తర్వాతే ఆమోదించాలని స్పష్టం చేశారు.
స్వచ్ఛ భారత్ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పారిశు ద్ధ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వచ్చే వారం నాటికి స్పష్టమైన పురోగతి చూపాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో వెంకట్ రాములు, జెడ్పీ డిప్యూటీ సీఈవో సుజాత, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ కాంట్రాక్టు కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలి

- డిమాండ్లు పరిష్కరించకుంటే రోజువారీ ధర్నాలు, నవంబర్ 28 నుంచి సమ్మెకు సిద్ధం
- ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ హెచ్చరిక

వనపర్తి, నవంబర్ 12 (జనంసాక్షి):
ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని యూనియన్ నాయకులు హెచ్చరించారు.

ఈ మేరకు అక్టోబర్ 28న మెడికల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రతి మూడేళ్లకోసారి వేతనాలు పెంచేవారని, నాలుగేళ్లు దాటినా పెంపు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీఓ నంబర్ 6 ప్రకారం కొత్తగా విధుల్లో చేరేవారికి రూ.16 వేల కనీస వేతనం నిర్ణయించిందని, అయితే 10 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్న అనుభవజ్ఞులైన కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలని కోరారు.



అలాగే పండుగ, జాతీయ, ఆర్జిత సెలవులు అమలు చేయాలని, ఏడాదికి ఒక నెల వేతనాన్ని బోనస్‌గా ఇవ్వాలని, రెండు జతల యూనిఫారాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ నిధులను పూర్తి స్థాయిలో కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కాంట్రాక్టర్లు ఈఎస్ఐ, పీఎఫ్ పేరుతో వేతనాల నుంచి మినహాయింపులు చేస్తున్నప్పటికీ, ఖాతాల్లో తక్కువ మొత్తాలు జమ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఆసుపత్రి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఆగస్టు 9న డీఎంఈ కార్యాలయం ఎదుట ధర్నా సందర్భంగా ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా ఉస్మానియా ఆసుపత్రి మినహా ఇతర ఆసుపత్రుల్లో అమలు కావడం లేదని పేర్కొన్నారు.

తమ డిమాండ్ల పరిష్కారం కోసం నవంబర్ 12 నుంచి ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే నవంబర్ 28 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేష్, శ్రీను, నరసింహ, నరేందర్, శ్రీకాంత్, పవన్, మోహన్, రవి, లక్ష్మి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి..

- మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి పరామర్శ



నిజాంపేట్, నవంబర్ 12(జనంసాక్షి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబాన్ని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పరామర్శించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. నిజాంపేట్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కుర్మా శివశంకర్ (23) వట్‌పల్లి మండలం గొర్రెకల్, నాగులపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టడంతో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ విషాద ఘటన గురించి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి కొత్తపల్లిలోని మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి తల్లి రుక్మమ్మను ఓదార్చి, అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ జగదీశ్వర్ చారి, మాజీ ఉపసర్పంచ్ ఇస్మాయిల్, సీనియర్ నాయకులు కై సాయిలు, కుర్మా మల్లేష్, ఎలుట్ల మల్లేష్, గ్రామ కార్యకర్తలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాసభలను జయప్రదం చేయాలి

కొండపాక, నవంబర్ 12 (జనంసాక్షి): నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించే ఏఐకేఎస్ 36వ అఖిలభారత రైతు మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అమ్ముల బాల్ నర్సయ్య పిలుపునిచ్చారు. వెలికట్ట చౌరస్తాలో మాట్లాడుతూ, రైతుల హక్కుల కోసం కిసాన్ సభ నిరంతరం పోరాడుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చిందని, 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఈనెల 15న జరిగే బహిరంగ సభకు రైతులు, కార్మికులు, కూలీలు భారీగా తరలిరావాలని కోరారు.

కేసీఆర్, హరీష్ రావుల వీరాభిమాని మృతి.. కుటుంబానికి ఆర్థిక సాయం



నంగునూరు, నవంబర్ 12 (జనంసాక్షి): మండలంలోని అంక్షాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త, కేసీఆర్, హరీష్ రావుల వీరాభిమాని పిల్లి యాదయ్య (68) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి అండగా తన వ్యక్తిగత సహాయకుడి ద్వారా రూ.5 వేల ఆర్థిక సాయం పంపించారు. ఈ నగదును సర్పంచ్ పద్మ బుచ్చి వీరయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు యాదయ్య మృతికి సంతాపం తెలిపారు.

ప్రజా ఆరోగ్యమే మా లక్ష్యం: సత్య కావలి

- భూ నీడులో ఉచిత మెగా వైద్య శిబిరం..
- ప్రజలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు



కొత్తపల్లి, నవంబర్ 12 (జనంసాక్షి):
కొత్తపల్లి మండలం భూనేడు గ్రామంలో యువ నాయకుడు సత్య కావలి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మద్దూరుకు చెందిన శ్రీ రాఘవేంద్ర క్లినిక్ అండ్ ఫార్మసీ సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

'మీ ఆరోగ్యమే మా ప్రాధాన్యత' అనే నినాదంతో నిర్వహించిన ఈ శిబిరంలో ఎంబీబీఎస్ జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ గణప మల్లిక, డాక్టర్ గణప అరవింద్ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, శరీర ఉష్ణోగ్రత తదితర పరీక్షలు చేసి, ఆరోగ్య సమస్యలపై ఉచిత సలహాలు అందించారు. అవసరమైన మందుల వినియోగంపై తగిన సూచనలు చేశారు.

సదాశివపేటలో నీరా కేంద్రం ప్రారంభం...

- గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి: శ్రీనివాస్ గౌడ్

సదాశివపేట, నవంబర్ 12 (జనంసాక్షి):
గీత కార్మికుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ కోరారు. గురువారం సదాశివపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన నీరా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.



ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంప్రదాయ గీత వృత్తిని ప్రోత్సహించడంతో పాటు, నీరా సేకరణ, నిల్వ, విక్రయాలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరారు. నీరాకు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని, సహజ పోషక విలువలున్న ఈ పానీయాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. గీత కార్మికులకు మార్కెటింగ్ సదుపాయాలు, ఆర్థిక సహకారం అందిస్తే ఉపాధి అవకాశాలు పెరిగి వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి గౌడ సంఘాలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నీరా సెంటర్ యాజమాన్య సభ్యులు కోవూరి సాయి గౌడ్, దత్తాత్రేయ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ కోవూరి శంకర్ గౌడ్, రాములు గౌడ్, సుభాన్ గౌడ్, మహేష్ గౌడ్, నర్సింగ్ రావు, గణేష్ గౌడ్, శేఖర్ గౌడ్, సుదర్శన్ రెడ్డి, ఎండి.యూసుఫ్ పాల్గొన్నారు.



బాలానగర్‌లో గంజాయి సేవించిన యువకుడిపై కేసు నమోదు!

- యూరిన్ టెస్ట్‌లో THC పాజిటివ్
- స్నేహితుడు సలీం సరఫరా చేస్తున్నట్లు వెల్లడి!

బాలానగర్, నవంబర్ 12(జనంసాక్షి):
పెద్దయిపల్లి గ్రామ పరిధిలోని బృందావన్ వెంచర్ వద్ద గంజాయి సేవించిన యువకుడిని బాలానగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

11.11.2026న గంజాయి సేవిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్ఐ పి.నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో రాజాపూర్ మండలం, ఈద్గాన్ పల్లి గ్రామానికి చెందిన రమణి నవీన్ (21)ను అదుపులోకి తీసుకున్నారు.

అతనికి నిర్వహించిన యూరిన్ డ్రగ్ టెస్ట్‌లో THC పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. విచారణలో తన స్నేహితుడు సలీం గంజాయి సిగరెట్లు సరఫరా చేస్తున్నట్లు నిందితుడు వెల్లడించాడు.

నిందితుడు డీ-అడిక్షన్ చికిత్సకు స్వచ్ఛందంగా అంగీకరించడంతో http://Cr.No 207/2026, చీన్నూ చట్టంలోని సెక్షన్ 27(ఎ) ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ పి. నరేందర్ రెడ్డి తెలిపారు.

ఓపియస్ పునరుద్ధరణకు నవంబర్ 17న సామూహిక సెలవు

మల్దకల్, నవంబర్ 12 (జనంసాక్షి):
టిఎస్సిపిఎస్ఈయు రాష్ట్ర శాఖ పిలుపు మేరకుకాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఓపిఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గురువారం జోగులాంబ గద్వాల్ జిల్లాలోని పలు కార్యాలయాల సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నవంబర్ 17వ తారీఖున సామూహికంగా సెలవులు అప్లై చేసుకున్నారని జిల్లా అధ్యక్షులు నాగరాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. మల్దకల్ మండలంలోని అందరు పంచాయతీ కార్యదర్శులు ఈనెల 17న పాత పెన్షన్ అమలు కొరకు ఎంపీడీఓ ఆంజనేయులు రెడ్డికి సామూహిక సెలవు పత్రం అందజేశారు.ఎంపివో జాకీర్,జిల్లా పంచాయితీ సెక్రటరీ అధ్యక్షులు ఖాజా మీర్,కార్యదర్శుల మండల అధ్యక్షులు తిరుమలయ్య, రాఘవేంద్రగౌడ్, రాజు, రాములు, లక్ష్మన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



120 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



పెద్ద శంకరంపేట్, నవంబర్ 12 (జనంసాక్షి):
పెద్ద శంకరంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి నివారణలో భాగంగా 120 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు వైద్య సిబ్బంది పరీక్షలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో, వైద్యాధికారి మాట్లాడుతూ.. క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌లో ఉర్కొండ విద్యార్థులకు ప్రథమ స్థానం



ఉర్కొండ, నవంబర్ 12 (జనంసాక్షి):
కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఆఫ్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఉర్కొండ మండలంలోని శ్రీ వేంకట బాల్ రామయ్య పాఠశాల విద్యార్థులు వాలీబాల్‌లో ప్రథమ స్థానం సాధించారు. విజేతలను పాఠశాల కరస్పాండెంట్ సామల బాల్ రాజు అభినందించి, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

బ్లూబెల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ మాధవి షీల్డ్ అందజేసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జార్జ్ జోసెఫ్, వైస్ ప్రిన్సిపాల్ రామ్ పెరుమాండ్ల, పీఈటీ భీమాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నగనాపూర్
గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

- గ్రామ సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి



కొల్చారం, నవంబర్ 12(జనంసాక్షి): కొల్చారం మండలంలోని చిన్నగనాపూర్ గ్రామంలో సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో సింధు హాస్పిటల్ హైదరాబాద్ వారు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో శిబిరం ఏర్పాటు చేసినందుకు సింధు హాస్పిటల్ యజమాన్యాన్ని సర్పంచ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు అండగా పీఎం రాహత్ పథకం

- ప్రమాదం జరిగితే రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం
- పీఎం రాహత్ అమలుపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- అదనపు ఎస్పీ పారితోష్ పంకజ్

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఆర్థిక భారం లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి 'పీఎం రాహత్' పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. ఈ పథకం ద్వారా ఒక్కో ప్రమాద బాధితుడికి రూ. 1.50 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని 24 గుర్తింపు పొందిన ఆసుపత్రుల వైద్యులు, సాంకేతిక సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని గుర్తింపు పొందిన ఆసుపత్రులకు తరలించి, ఎలాంటి జాప్యం లేకుండా వైద్య సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులు, ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.





అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ... పథకం అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ, సంబంధిత శాఖల అధికారు లు, 24 ఆసుపత్రుల వైద్యులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఐసీకి చెందిన సాయిచరణ్, ఆరోగ్యశ్రీ బృందం నాయకుడు ప్రవీణ్‌లు పీఎం రాహత్ పథకానికి సంబంధించిన ఈడీఏఆర్ దరఖాస్తు వినియోగం, నమోదు ప్రక్రియ, పనితీరుపై వివరించారు.

ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు పంటల మార్పిడిపై అవగాహన

- తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలి
- నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

కొల్చారం, నవంబర్ 12 (జనంసాక్షి):
ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో పంటల మార్పిడి, నీటి సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించేందుకు కొల్చారం మండలంలోని అంసాన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న వర్షాకాల పరిస్థితులు, భూగర్భ జలమట్టం తగ్గుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు చర్యలపై రైతులకు అధికారులు వివరించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి మాట్లాడుతూ.. భూగర్భ జలమట్టం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, అలసంద, పొద్దుతిరుగుడు, వేరుశనగ వంటి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనుకూలమైన భూములు, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి దీర్ఘకాలిక ఆదాయం పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

వ్యవసాయ శాఖ అధికారులు రుతుపవనాల రాక, వర్షాల పరిస్థితులు, విత్తనాలు వేసేందుకు అనువైన సమయంపై అవగాహన కల్పించారు.



నీటి లభ్యతను బట్టి ఆకుకూరలు, బెండ, గోరుచిక్కుడు వంటి కూరగాయలు సాగుచేయాలని, డ్రిప్ సౌకర్యం ఉన్న రైతులు టమాటా, మిరప, బీరకాయ, కాకరకాయ, సొరకాయ వంటి పంటలను సాగు చేసుకోవచ్చని వివరించారు.

డ్రిప్ ఇరిగేషన్ పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరిస్తూ ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, చిన్న, సన్నకారు, బీసీ రైతులకు 80 శాతం, ఇతర రైతులకు 70 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఏపీఓ మాట్లాడుతూ వి.బి.జి. రామ్ జీ పథకం ద్వారా గ్రామాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు చేపట్టే పనులను వివరించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవడంతో పాటు గ్రామ స్థాయిలో కమ్యూనిటీ సోక్‌పిట్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ధ్వంసంపై నిరసన ర్యాలీ

- ఈ నెల 14న నర్సాపూర్‌లో శాంతియుత నిరసన.. విగ్రహ పునఃప్రతిష్ఠ

నర్సాపూర్, నవంబర్ 12 (జనంసాక్షి):



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం చిన్న చింతకుంట గేట్ సమీపంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 9వ తేదీన కలియుగ కాలజ్ఞానాన్ని రచించిన మహానుభావుడు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను నిరసిస్తూ ఈ నెల 14వ తేదీ శనివారం నర్సాపూర్‌లో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు శ్రీ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం పెద్దలు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి మెదక్ జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాలోని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాల పెద్దలు, వివిధ సంఘాల అధ్యక్షులు, యువ నాయకులు, రాష్ట్రస్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని తిరిగి పునఃప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. స్వామివారి విగ్రహ ధ్వంసం ఘటనపై నిరసన తెలియజేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు కోరారు.ఈ కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాల నాయకులు, భక్తులు, కుల పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శాంతియుత నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని శ్రీ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నర్సాపూర్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే



మద్దకల్, నవంబర్ 12 (జనంసాక్షి): మండల కేంద్రంలోని పెద్ద రామన్నకు చెందిన ఇందిరమ్మ ఇల్లును గురువారం గద్వాల ఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం చేశారు. దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొనిగృహ ప్రవేశాలు చేసుకోవాలని, ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డితో సాధ్యమైనది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు,మాజీ ఎంపీపీరాజారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న, సర్పంచ్ చిట్టెమ్మ, నాయకులు వెంకటన్న, మైలగడ్డ చంద్రశేఖర్, నల్లారెడ్డి, నరసింహులు,మధు,మాజీ సర్పంచ్ కొంకతి నరేందర్,రాముడు, ఉప్పరినారాయణ,మహేష్, యాకోబు,లక్ష్మన్న,బద్రి, గోపాల్,తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్య
పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం

- పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు, మందుల పంపిణీ

గుమ్మడిదల, నవంబర్ 12 (జనంసాక్షి):



గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని ఎర్రచెరువు కట్ట సమీపంలో గురువారం న్యూల్యాండ్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. నేషనల్ ఆగ్రో ఫౌండేషన్, న్యూల్యాండ్ ఫౌండేషన్‌ల సంయుక్త సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ శిబిరంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, దూడలకు పశువైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా చికిత్స అందించారు. గర్భకోశ, పునరుత్పత్తి సంబంధిత సమస్యలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించారు. నులిపురుగులు, నల్లిపురుగుల నివారణకు మందులు పంపిణీ చేయడంతో పాటు పశువులకు టీకాలు వేశారు. యాంటీబయాటిక్స్, విటమిన్లు, ఖనిజ మిశ్రమాలు, వాపు, కడుపు ఉబ్బరం నివారణ మందులను ఉచితంగా అందజేశారు.

ఈ సందర్భంగా పశువుల పెంపకందారులకు పశువుల పోషకాహారం, పశుగ్రాసం, వ్యాధుల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన ప్రాథమిక జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. విషప్రయోగం వంటి ప్రమాదకర పరిస్థితుల్లో వెంటనే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, పశువైద్య అధికారి నరసింహారావు, పరిశ్రమ ప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులుగా
వెంకట శివప్రసాద్, వల్లూరి రాజు

మిడ్జిల్, నవంబర్ 12 (జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీ మిడ్జిల్ మండల ఉపాధ్యక్షులుగా బైరంపల్లికి చెందిన వెంకట శివప్రసాద్, వేములకు చెందిన వల్లూరి రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వారికి నియామక పత్రాలు అందజేశారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. తమకు అప్పగించిన బాధ్యతలను





సమర్థవంతంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన ఉపాధ్యక్షులు తెలిపారు. వారి నియామకంపై ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గౌస్, మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, సాయిలు, విజయకుమార్, నరసింహ, ప్రశాంత్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలంపల్లిలో అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

కృష్ణ, నవంబర్ 12 (జనంసాక్షి): కృష్ణ మండలం ఆలంపల్లిలో గంగి గంగప్ప(13) అనే విద్యార్థి చెట్టుకి వెలాడుతు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు.గంగప్ప ధన్వాడలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో ఏడవ తరగతి హాస్టల్లో ఉంటూ చదువుతున్నాడు. దీపా వళి సెలవులకి హాస్టల్ నుండి ఇంటికి వచ్చి దీపావళి అయిపోయాక 11న ఉదయం 11:30 కి ఆలంపల్లి గేట్ దగ్గర నుండి ధన్వాడ వెళ్లడానికి బయ లుదేరినాడు. సాయంత్రం స్కూల్ కి ఫోన్ చేసినప్పుడు గంగప్ప ఇంకా స్కూల్ కి రాలేదని తెలిపారు. గురువారం ఉదయం అందాజ 11 గంటలకి ఆలంపల్లి గ్రామ శివారులో గంగప్ప మృతదేహం చెట్టు కు వేలాడుతూ కనిపించింది. అనుమానా స్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కృష్ణ ఎస్ ఐ నవిద్ తెలిపారు.

రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి





నంగునూర్, (జనంసాక్షి):
వార్షిక తనిఖీల్లో భాగంగా మల్టీ జోన్-1 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) చంద్రశేఖర్ రెడ్డి గురువారం సిద్దిపేట జిల్లా రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఐజీకి సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం స్వీకరించిన ఐజీ, స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు.



ఈ సందర్భంగా ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...
మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.
విధులతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, హెల్త్ ప్రొఫైలింగ్ చేయించుకోవడంతో పాటు ప్రతి రోజూ ఫిట్‌నెస్ వ్యాయామాలు చేయాలని తెలిపారు.



పోలీసులు హెల్మెట్, ప్రజలు ఎవరైనా ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. స్టేషన్ రికార్డులు, కిట్ ఆర్టికల్స్, రిసెప్షన్ వర్టికల్ పనితీరును పరిశీలించారు. పెండింగ్ కేసులపై నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షలుపడేలా ఎస్ఓపీ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీ రష్మి పెరుమాళ్, ఏసీపీ రవీందర్ రెడ్డి, సీఐలు విద్యాసాగర్, కిరణ్, లతీఫ్, ఎస్ఐలు వివేక్, చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన వధూవరులను
ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

పెద్ద శంకరంపేట, నవంబర్ 12 (జనంసాక్షి): శంకరంపేట (ఆ) మండలం చిలపల్లి గ్రామానికి చెందిన మాణిక్ రెడ్డి కుమారుడి వివాహ వేడుకకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ సురేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ జగదీశ్వర్ చారి, మాజీ ఎంపీటీసీ మాణిక్ రెడ్డి, రానాపూర్ సర్పంచ్ సంగారెడ్డి, ఉపసర్పంచ్ రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చుంచనకోటలో
క్యాటిల్ ట్రాఫ్‌ల నిర్మాణానికి భూమిపూజ



చేర్యాల, నవంబర్ 12 (జనంసాక్షి):
చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో ఉపాధి హామీ పథకం వీబీజీరామ్‌జీలో భాగంగా కమ్యూనిటీ నీటి తొట్టెల (క్యాటిల్ ట్రాఫ్స్) నిర్మాణానికి గురువారం ముగ్గు పోశారు. గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఊరిలో రోడ్ల వైపున ఈ నీటి తొట్టెలను ఏర్పాటు చేయడం వల్ల అన్ని కాలాల్లో, ముఖ్యంగా వేసవిలో పశువులు, పక్షుల దాహార్తి తీర్చడానికి ఉపయోగపడతాయని వాటి ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ దివ్య, టెక్నికల్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, ఉప సర్పంచ్ వట్టిపల్లి ఆగయ్య, శీర్ల శ్రీకాంత్, మంద వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ
నిర్మాణానికి రూ.7,00,116 విరాళం..



అమీన్‌పూర్, నవంబర్ 12 (జనంసాక్షి):
బీరంగూడ గుట్టపై నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పృథ్వీరాజ్ రూ.700116లను విరాళంగా అందజేశారు. ఈ నెల 22వ తేదిన జరగనున్న విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గురువారం ఆలయాన్ని సందర్శించిన ఆయన ఈ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు దేవాలయాలు ప్రతీకలని అన్నారు. దేవాలయాలు కేవలం ప్రార్థనా మందిరాలే కాకుండా భక్తి, ఐక్యత, సేవాభావం, సామాజిక సమైక్యతను పెంపొందించే పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రాలని పేర్కొన్నారు. దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధి ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో భక్తులు, దాతలు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొల్లూరి మల్లేశం, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజా సేవకే మా కుటుంబం అంకితం: మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

- ఘనంగా చైర్మన్ ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



చేర్యాల, నవంబర్ 12 (జనంసాక్షి):
ప్రజా సేవకే తమ కుటుంబాన్ని అంకితం చేస్తామని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం చేర్యాల పట్టణంలోని కళ్యాణి గార్డెన్‌లో ఘనంగా జరిగాయి. అంతకు ముందు కొమురవెల్లి నుంచి చేర్యాల వరకు భారీ కాన్వాయ్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన వేడుకలలో పార్టీ నాయకులు, ప్రముఖులు శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన పోరాటాల పురిటి గడ్డ చేర్యాల, జనగామ ప్రాంతమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేర్యాలకు రావాల్సిన సాగునీటిని గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాలకు తరలించుకుపోయారని విమర్శించారు. గత ప్రభుత్వంలో కుటుంబ సభ్యులే మంత్రులుగా రాష్ట్రాన్ని పాలించి దోచుకున్నారని ఆరోపించారు.ఈ ప్రాంత బిడ్డగా చేర్యాల ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా నిలబడతామని, ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచి ప్రజలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎస్ఐఆర్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా 20వేల ఓట్ల పైచిలుకు బయటపడ్డాయన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి దొంగ ఓట్లపై చర్చకు రావాలని కొమ్మూరి సవాల్ విసిరారు. అనంతరం మార్కెట్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి బాటలో నడుస్తూ ఎలాంటి అవినీతికి తావులేకుండా ప్రజలకు, రైతులకు సేవ చేస్తానని అన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ప్రముఖులు పాల్గొన్నారు.





సంస్కార్ విద్యాలయంలో పిట్లం యోగ సంస్థాన్



పెద్ద శంకరంపేట, నవంబర్ 12 (జనంసాక్షి): పెద్ద శంకరంపేట్‌లోని సంస్కార్ విద్యాలయంలో పిట్లం యోగ సంస్థాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగ సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యం ప్రాముఖ్యతను వివరించడంతో పాటు సూర్య నమస్కారాలు, వివిధ యోగాసనాలను నేర్పించారు. ఆరోగ్యంగా ఉండేందుకు పాటించాల్సిన దైనందిన అలవాట్లపై అవగాహన కల్పించారు. చిన్నప్పటి నుంచే యోగాను దైనందిన జీవితంలో భాగంగా అలవర్చుకోవాలని, తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని యోగ సాధకులు సూచించారు. ఈ కార్యక్రమంలో యోగ సంస్థాన్ సాధకులు శ్రీనివాస్ (ఎస్‌వీ సిల్క్స్, పిట్లం), దత్తాత్రేయ, శ్రీనివాస్‌తో పాటు సంస్కార్ విద్యాలయ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఐజ విద్యార్థి



అయిజ, నవంబర్ 12 (జనంసాక్షి): టైక్వాండో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు శ్రీకృష్ణవేణి విద్యార్థి ధర్మతేజ ఎంపిక. శ్రీకృష్ణవేణి హైస్కూల్, ఐజ పట్టణానికి చెందిన 8వ తరగతి విద్యార్థి ధర్మతేజ టైక్వాండో అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయి, జోనల్ స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి ఈ ఘనత సాధించాడు. ఆదివారం హైదరాబాద్ వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ధర్మతేజ పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి.మధుసూదన్ రెడ్డి, విద్యార్థిని అభినందించి శాలువాతో సన్మానించారు. రాష్ట్ర స్థాయిలోనూ విజయం సాధించి పాఠశాలకు, ఐజ పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

శ్రీ గురుపీఠంలో భక్తుల ప్రత్యేక పూజలు



శివ్వంపేట, నవంబర్ 12 (జనంసాక్షి):
మండలంలోని గూడూరు గ్రామంలో కొలువైన శ్రీ గురుపీఠం, శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం, పంచవటి, శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతో పాటు జంట నగరాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం అభిషేకం, అర్చన, దివ్య మంగళ హారతి అనంతరం శ్రీ దత్తాత్రేయ శతనామార్చన, స్తోత్ర పఠనం, భజనలు నిర్వహించారు.
మధ్యాహ్నం శ్రీ సద్గురు సాయి హారతి, సత్సంగం, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని పుష్పమాలలతో అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పెద్దగాని శివకుమార్ గౌడ్, రమాదేవి దంపతులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

ఆడపిల్లల భవిష్యత్తుకు
ఆర్థిక భరోసా సుకన్య సమృద్ధి యోజనపై అవగాహన..

- అర్హులైన బాలికలందరికీ పథకం చేరాలి: మున్సిపల్ కమిషనర్



రామాయంపేట, నవంబర్ 12 (జనంసాక్షి):
ఆడపిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ఉన్నత విద్య, ఆర్థిక భద్రతకు తోడ్పడే సుకన్య సమృద్ధి యోజన పథకంపై రామాయంపేట మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి సారించింది. పట్టణ పరిధిలోని అర్హులైన బాలికలందరికీ ఈ పథకం ప్రయోజనాలు అందేలా విస్తృత అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ అధికారులను ఆదేశించారు.
గురువారం ఆయన అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పదేళ్లలోపు వయస్సు ఉన్న బాలికల పేరుతో తల్లిదండ్రులు లేదా సంరక్షకులు సుకన్య సమృద్ధి ఖాతా తెరవవచ్చన్నారు. సంవత్సరానికి కనీసం రూ.250 నుంచి గరిష్టంగా రూ.1.50 లక్షల వరకు పొదుపు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ఈ పథకంలో 8.2 శాతం వడ్డీ లభిస్తోందని, బాలికల ఉన్నత విద్య కోసం 18 ఏళ్ల నిండిన తర్వాత నిబంధనల ప్రకారం 50 శాతం వరకు నగదు ఉపసంహరించుకోవచ్చని తెలిపారు.ఖాతా ప్రారంభించిన నాటి నుంచి 15 సంవత్సరాల పాటు డిపాజిట్లు చేయాల్సి ఉంటుందని, 21 సంవత్సరాలకు ఖాతా మెచ్యూరిటీ అవుతుందని వివరించారు. పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూరేలా పోస్టాఫీస్, ఐసీడీఎస్, విద్యాశాఖ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పథకంపై పూర్తి వివరాల కోసం సమీప పోస్టాఫీస్ లేదా రామాయంపేట మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని కమిషనర్ ప్రజలకు సూచించారు. సమావేశంలో పోస్టాఫీస్, ఐసీడీఎస్, విద్యాశాఖ, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆవిష్కరణల ప్రపంచంలోకి విద్యార్థుల అడుగులు

- బీవీఆర్ఐటీలో యెల్దుర్తి పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం



నర్సాపూర్, నవంబర్ 12 (జనంసాక్షి):
పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ) ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెదక్ జిల్లా యెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 63 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలలోని ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్ (AICTE IDEA Lab), విష్ణు వెంచర్ ల్యాబ్స్ ఫౌండేషన్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరికరాలు, నూతన ఆవిష్కరణల రూపకల్పన, ప్రోటోటైప్ తయారీ విధానాలను ఆసక్తిగా పరిశీలించి అవగాహన పొందారు.
ఈ సందర్భంగా డా.వి.మురళీకృష్ణ, శ్రీ రోహిత్ విద్యార్థులకు ఆవిష్కరణల ప్రాముఖ్యత, వినూత్న ఆలోచనలను ఆచరణలో పెట్టే విధానం, ప్రోటోటైప్ తయారీ, స్టార్టప్‌ల స్థాపన తదితర అంశాలపై వివరించారు. విద్యార్థులు తమలోని సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టి భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే, మేనేజర్ బి. బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డా. పి.చంద్రబాబు, డా.కె. శ్రీనివాసరావు సమన్వయం చేశారు.

పెండింగ్ పీఆర్సీ అమలుకు నూతన కమిటీ నియమించాలి

- స్పాట్ బిల్లర్లకు న్యాయం చేయాలి: 327 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగుల శ్రీధర్



నారాయణపేట, నవంబర్ 12 (జనంసాక్షి): రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులకు 2026 పెండింగ్ పీఆర్సీ అమలుకు ప్రభుత్వం వెంటనే నూతన కమిటీని నియమించి, సకాలంలో పీఆర్సీ అందేలా చర్యలు తీసుకోవాలని 327 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగుల శ్రీధర్ డిమాండ్ చేశారు. నారాయణపేట సర్కిల్ పరిధిలోని దామరగిద్ద, నారాయణపేట సెక్షన్లలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం నారాయణపేటలోని శ్రీ గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
నూతన నారాయణపేట సర్కిల్ ఏర్పాటైన తర్వాత సర్కిల్ విభజనలో కేటాయించిన పోస్టులను తిరిగి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించడంతో తగినంత మంది ఉద్యోగులు లేకుండానే సర్కిల్‌ను నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన పోస్టులు, అధికారులు లేకపోవడంతో ప్రజలకు సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పనిచేస్తున్న ఉద్యోగులపై పని భారం పెరుగుతోందని తెలిపారు. డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉద్యోగులను తిరిగి నారాయణపేట సర్కిల్‌లో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
విద్యుత్ శాఖలో స్పాట్ బిల్లర్లుగా 50 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులు ఉన్నారని తెలిపారు. వారి విద్యార్హతలను పరిగణనలోకి తీసుకొని ఐటీఐ అర్హత కలిగిన స్పాట్ బిల్లర్లను ఆర్టిజన్ల తరహాలో గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీస్‌రేట్ కార్మికులుగా నామకరణం చేసినప్పటికీ, బిల్లింగ్ ప్రక్రియలో వారి పాత్ర కీలకమని, యాజమాన్యం వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఓఅండ్ఎం ఉద్యోగులు విధి నిర్వహణలో భద్రతా ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో కంపెనీ సెక్రటరీ భూపాల్ రెడ్డి, రీజినల్ ప్రెసిడెంట్ కే.ఎల్. శ్రీనివాస్, రీజినల్ కార్యదర్శి ఎం.డి. మహమ్మద్, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ భీమ్, డివిజన్ అదనపు కార్యదర్శి మహబూబ్ పాషా, సర్కిల్ కార్మికులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ వాసుల దశాబ్దాల కల సాకారం దిశగా అడుగులు

- లింగంపల్లి నాలా బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎంపీ రఘునందన్ రావు



అమీన్‌పూర్, నవంబర్ 12 (జనంసాక్షి):
అమీన్పూర్ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రహదారి సౌకర్యం త్వరలో అందుబాటులోకి రానుందని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు తెలిపారు. లింగంపల్లి నాలాపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఆయన గురువారం పరిశీలించారు. జాతీయ రహదారి నుంచి ఈ బ్రిడ్జి మీదుగా అమీన్పూర్‌కు నేరుగా రహదారి సౌకర్యం ఏర్పడుతుందని ఆయన చెప్పారు.
దీనివల్ల ప్రయాణ సమయం తగ్గుతుందని, ఈ ప్రాంతంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యకు ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. బంధంకొమ్ము వద్ద రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న సమస్యలను పరిష్కరించామని, అక్కడ కూడా త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, అమీన్పూర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎంపీ స్పష్టం చేశారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే అమీన్పూర్ పరిసర ప్రాంతాంలో మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఆయనతో పాటు భాపాజ సంగారెడ్డి ప్రధాన కార్యదర్శి రాజ శేఖర్‌రెడ్డి, రామచంద్రాపురం డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ గౌడ్, పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ నాయకులు ఉన్నారు.

అనంతారం రైతులకు 22-ఏ నిషేధిత జాబితా కష్టాలు

- 169 ఎకరాల భూములను జాబితా నుంచి తొలగించాలి
- ప్రభుత్వ హామీ అమలులో జాప్యం.. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు
- రైతులకు న్యాయం చేయకపోతే బీఆర్ఎస్ తరపున పోరాటం: చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



గుమ్మడిదల, నవంబర్ 12 (జనంసాక్షి): మండలంలోని అనంతారం గ్రామ పరిధిలో 169 ఎకరాల భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గుమ్మడిదలలోని సీజీఆర్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
సర్వే నంబర్ 173లో 59 ఎకరాలు, 174/1 నుంచి 174/10 వరకు 110 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భూములను జాబితా నుంచి తొలగిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు పలుమార్లు వినతులు ఇచ్చినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు. రైతులకు న్యాయం చేయకపోతే బీఆర్ఎస్ తరఫున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, బండాల భాస్కర్, హనుమంతు పాల్గొన్నారు.

వేళలు పాటించని వైన్ షాపు... ఇబ్బందులకు గురవుతున్న మద్యం ప్రజలు



పెద్దకొత్తపల్లి, నవంబర్ 12 (జనంసాక్షి): ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా మద్యం షాపులు యజమానులు వేళలు పాటించకపోవడంతో మద్యం ప్రియులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని మైసమ్మ వైన్ షాప్ బుధవారం రాత్రి 9 గంటల 20 నిమిషాలకు షాపును బంద్ చేయడంతో మద్యం సేవించే మద్యం ప్రియులు మద్యానికి వచ్చి షాప్ బంద్ ఉండడంతో బెల్ట్ షాపులను ఆశ్రయించడంతో బీరు కొన్న క్వాటర్ కొన్న 30 నుండి 50 రూపాయల వరకు అధికంగా విక్రయాలు జరుగుతుండడం మద్యం ప్రజలకు కొనుగోలు చేయుటకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైన్ షాప్ వేళలు ఉదయం 10 గంటలకు షాపులు ఓపెన్ చేసి రాత్రి10 గంటలకు వైన్ షాప్ ను బందు చేయాల్సి ఉండగా మద్యం షాపుల యజమానులు వారికి నచ్చిన విధంగా తమయపాలన పాటిస్తూ 10 గంటల వరకు వైన్ షాపు తెరిచి ఉండకుండా 9 గంటల 20 నిమిషాలకే వైన్ షాపును బంద్ చేయడంతో ప్రతినిత్యం సేవించే మద్యం ప్రియులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయపాలన పాటించని వైన్ షాప్ యజమానులపై ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాల్సింది పోయి నిమ్మకు నీరేత్తినట్లుగా ఉంటూ పట్టించుకోకపోవడంతోనే వైన్ షాపుల యజమానులకు అడ్డు అదుపు లేకుండా పోతుందని మద్యం ప్రజలు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు వేళలు పాటించని వైన్ షాప్ యజమానులపై ప్రతినిత్యం నిఘా ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా సమయ పాలన పాటించే విధంగా చూడాల్సి ఉందని మద్యం ప్రజలు కోరుతున్నారు.

మద్దూరు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

- రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్



మద్దూరు, నవంబర్ 12 (జనంసాక్షి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం మద్దూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన నిర్వహించారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, 23రోజుల వేతనంతో కూడిన సెలవులు, ఏడాదికి ఒక నెల బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. యూనియన్ నాయకులు కే. రవి, మహేష్ మాట్లాడుతూ ఆసుపత్రుల పరిశుభ్రత, రోగుల సంరక్షణలో కీలక సేవలందిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండు జతల యూనిఫాంలు అందించాలని కోరారు. కార్యక్రమంలో లలిత, దేవమ్మ, సకినా, రేణుక, రవికుమార్ పాల్గొన్నారు.

జిల్లాలో ఎల్‌నినో గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించాలి

- కరువు అవగాహనతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, జలసిరి కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: అదనపు కలెక్టర్ నగేష్
- ఉపాధిహామీ పనుల ద్వారా కూలీలకు విస్తృతంగా పని కల్పించాలి • గ్రామ సభలు నిర్వహణలో సంబంధిత అధికారుల సమన్వయం అవసరం

మెదక్ బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి):
జిల్లాలో ఎల్‌నినో గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను, ఎంపీడీవోలను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా గ్రామీణ అభివృద్ధి, పంచాయితీ, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో కలిసి ఎంపీడీవోలతో ఎల్‌నినో గ్రామసభలు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, జలసిరి పనులు, అంగన్వాడి బిల్డింగ్స్ నిర్మాణం, తదితర అంశాలపై గూగుల్ మీట్ నిర్వహించారు. ముందుగా ఎల్‌నినో గ్రామసభల నిర్వహణ తీరుపై వివిధ మండలాల ఎంపీడీవోల వారిగా రివ్యూ నిర్వహించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో గ్రామసభలు క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జలసిరి పనులకు సంబంధించి కొన్ని మండలాల్లో కొత్త పనుల ప్రారంభం, గ్రౌండింగ్, పూర్తిలో ఆశించిన పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.



మంజూరైన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ సోక్‌పిట్స్ నిర్మాణంలో కూడా పురోగతి పెంచాలన్నారు. వచ్చే వారం నాటికి నిర్దేశించిన లక్ష్యాలకు, మంజూరైన పనులన్నీ ప్రారంభించి పురోగతి సాధించాలని ఆదేశించారు. గ్రామసభలు నిర్వహించే టప్పుడు ప్రతి శాఖ యాక్టివిటీ గురించి తప్పనిసరిగా చర్చించాలన్నారు. జిల్లా విద్యాశాఖ తరఫున పాఠశాల



ల్లో ఎల్‌నినో అంశంపై విద్యార్థులతో మాట్లాడించాలన్నారు. ప్రతి మండలం వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, మిషన్ భగీరథ సంపత్ కుమార్, డిఎల్‌పిఓలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత
ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



సదాశివపేట, నవంబర్ 12 (జనంసాక్షి):
మండలంలోని వెంకటాపురం గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు గురువారం భూమి పూజ నిర్వహించారు. సీడీసీ చైర్మన్ గడిల రామ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో పేదలు సొంతింటి కలను సాకారం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కరణం సందీప్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, హౌసింగ్ ఏఈ రేష్మ, పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌నినో
ప్రభావంపై రైతులకు అవగాహన

- ఆరుతడి, చిరుధాన్యాల సాగుకు అధికారుల సూచనలు



రామాయంపేట, నవంబర్ 12 (జనంసాక్షి):
రామాయంపేట మండలంలోని ఆర్.వెంకటాపూర్, గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావం,ప్రత్యామ్నాయ పంటల సాగుపై గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వర్షపాతంలో మార్పుల నేపథ్యంలో రైతులు వరికి బదులుగా మొక్కజొన్న, జొన్న, సజ్జలు, పెసర, మినుము, కందులు వంటి ఆరుతడి పంటలు, చిరుధాన్యాలు సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించుకుంటూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలని తెలిపారు. సర్పంచ్ వెంకుగారు ఉమా సంజీవ రెడ్డి, అధ్యక్షతన జరిగిన గ్రామసభలో తహసీల్దార్ రజినీ కుమారి, వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ
దృక్పథానికి చెకుముకి టాలెంట్ టెస్ట్



నంగునూరు, నవంబర్ 12 (జనంసాక్షి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం నంగునూరు మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ప్రతి తరగతి నుంచి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించారు.
విజేతలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని తెలిపారు. మండల స్థాయిలోనూ రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

బీఆర్ఎస్ నాయకుడు మసూద్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి, నవంబర్ 12 (జనంసాక్షి):
అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ సీనియర్ మైనారిటీ నాయకుడు మసూద్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మసూద్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మసూద్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.కె. రషీద్, జీవీ శ్రీనివాస్, విఠల్, అజీమ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు
సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండ

- 12 మంది లబ్ధిదారులకు రూ.6.50 లక్షల చెక్కుల పంపిణీ
- ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు



సంగారెడ్డి, నవంబర్ 12 (జనంసాక్షి): వివిధ కారణాలతో చికిత్సలు పొందుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తుందని ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.6.50 లక్షల విలువైన చెక్కులను ఆత్మ కమిటీ చైర్మన్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వై. ప్రభు మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. మండలంలోని 12 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6.50 లక్షల చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, శ్రీకాంత్ రెడ్డి, నరసింహారెడ్డి, అశోక్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డు అందజేసిన మున్సిపల్ చైర్‌పర్సన్

రామాయంపేట, నవంబర్ 12 (జనంసాక్షి):
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు గోలిపర్తి గ్రామంలో గురువారం నూతన స్మార్ట్ రేషన్ కార్డును మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు లబ్ధిదారుడికి అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడమే లక్ష్యంగా రేషన్ కార్డుల పంపిణీ చేపడుతున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.
స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందనున్నాయని పేర్కొన్నారు. అర్హులైన



ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మట్టి యాదగిరి, పచ్చంటి రాములు, పరశురాం, ఎర్రం సత్యం, ఎర్ర వెంకీ యాదగిరి, పాత నరేష్, సాదుల రాజుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పత్తి చోరీలకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్సై చైతన్య కిరణ్



రాయికోడ్, నవంబర్ 12 (జనంసాక్షి): మండలంలో పత్తి చోరీలు జరగకుండా రైతులు, గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చైతన్య కిరణ్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ పత్తి సీజన్ నేపథ్యంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పొలాల్లో నిల్వ ఉంచిన పత్తి, పత్తి బస్తాలను చోరీ చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. రైతులు పంటను పొలాల్లో, రోడ్ల పక్కన నిర్లక్ష్యంగా వదిలేయకుండా భద్రత కల్పించుకోవాలని సూచించారు. రాత్రివేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పత్తి చోరీలకు పాల్పడినా, చోరీ సొత్తును కొనుగోలు చేసినా, సహకరించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల పంటను కాపాడేందుకు పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఎన్నికల అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన

- వ్యాసరచన, క్విజ్ పోటీల నిర్వహణ



నర్సాపూర్, నవంబర్ 12(జనంసాక్షి):
విద్యార్థుల్లో ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాధాన్యాన్ని తెలియజేసే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నర్సాపూర్‌లోని PM SHRI ZPHS BOYS పాఠశాలలో గురువారం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు.ఎన్నికల అక్షరాస్యత సంఘాల (Electoral Literacy Clubs) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వ్యాసరచనకు ఐదుగురు, క్విజ్ పోటీలకు ఐదుగురు విద్యార్థులు పాల్గొన్నారు.
వ్యాసరచన పోటీల్లో 'Importance of Pure Electoral Roll', 'Importance of Voting' అనే అంశాలను కేటాయించారు. క్విజ్ పోటీల్లో ఓటరు జాబితా తయారీ, ఈవీఎం, వీవీప్యాట్, పోలింగ్ విధానం, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై ప్రశ్నలు అడిగి విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, స్థానిక మండల విద్యాశాఖ అధికారి తారాసింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమ్యా నాయక్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఎన్నికల వ్యవస్థపై అవగాహన కల్పించి, ఓటు హక్కు విలువను తెలియజేయడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు.



ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు: తహసీల్దార్ వెంకటేశం

అమీన్‌పూర్, నవంబర్ 12 (జనంసాక్షి):
ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటేశం హెచ్చరించారు. గురువారం అమీన్‌పూర్ పరిధిలోని సర్వే నంబర్లు 991, 630, 1042లలో ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కబ్జాలు చేస్తే స్థానికు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

భారీగా మత్తుపదార్థం పట్టివేత



గద్వాల, నవంబరు 12(జనంసాక్షి):
అయిజలో మంగళవారం దాడులు నిర్వహించిన గద్వాల ఎక్సైజ్ పోలీసులు 134.55 కిలోల క్లోరల్ హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో పట్టణానికి చెందిన గుండ్రాతి వీరేంద్ర గౌడ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.
స్వాధీనం చేసుకున్న ఈ నిషేధిత రసాయనం విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.6 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం నిందితుడి నివాసంపై ఆకస్మిక దాడులు నిర్వహించి ఈ సరుకును గుర్తించింది. కల్తీ కల్లు తయారీలో ఈ ప్రమాదకరమైన క్లోరల్ హైడ్రేట్‌ను ఉపయోగిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ కల్తీ కల్లు విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ఈ అక్రమ దందా వెనుక ఇంకా ఎవరెవరి హస్తం ఉందనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.నిందితుడికి ఈ రసాయనం ఎక్కడి నుంచి సరఫరా అవుతోందనే వివరాలను రాబట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అరెస్టు చేసిన నిందితుడిని రిమాండ్ నిమిత్తం స్థానిక కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు వెల్లడించారు.
ఈ దాడిలో గద్వాల ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలతో పాటు సిబ్బంది చురుగ్గా పాల్గొని అక్రమ రవాణాను అడ్డుకున్నారు.

143 యూనియన్ జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ పదవులకు నామినేషన్



నారాయణపేట నవంబర్ 12(జనంసాక్షి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) నారాయణపేట జిల్లా శాఖ తరపున జాతీ య కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల స్థానాలకు నాయకులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా అధ్యక్షులు కలాల్ ఆనంద్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల యూనియన్ (టీఈఎంజేయూ) జిల్లా అధ్యక్షుడు అవుటీ రాజ శేఖర్‌తో పాటు జిల్లా నాయకులు నారాయణ, రమేష్, రఫీ పాల్గొని నామినేషన్ ప్రక్రియలో భాగస్వాములయ్యారు.

మహిళల భద్రతకు పోలీసుల కొత్త భరోసా...

- వేధింపులపై ఇక నిర్భయంగా ఫిర్యాదు చేయొచ్చు
- ప్రతి పాఠశాల, కళాశాలలో షీ బాక్స్‌లు
- ఫిర్యాదు చేసిన వారం రోజుల్లోనే విచారణ
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచాలి
- ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి):
మహిళల భద్రత కోసం పోలీసులు కొత్త భరోసా కల్పించారు. మహిళలు, బాలికల భద్రతకు మరింత భరోసా కల్పించేందుకు సంగారెడ్డి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో 200 షీ బాక్స్‌లను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, మహిళా వసతి గృహాలు, బస్టాండ్లు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళలు, బాలికలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా తమ సమస్యలను తెలియజేసేందుకు గోప్యత కలిగిన ప్రదేశాల్లో



వీటిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో షీ బాక్స్‌ల నిర్వహణ బాధ్యతను మహిళా పోలీసు అధికారికి అప్పగించనున్నట్లు తెలిపారు. ప్రతి శనివారం బాక్స్‌లను తెరిచి ఫిర్యాదులను సేకరించి, అదే రోజు షీ టీమ్స్ ఇన్‌చార్జి, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్‌కు అందజేయాలని సూచించారు. అందిన ఫిర్యాదులను ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో నమోదు చేసి, వారం రోజుల్లోగా విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల వ్యక్తిగత వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు.

రైతుల భూ సమస్యల పరిష్కారానికే భూ పునఃసర్వే

- మగ్దుంపల్లిలో పునఃసర్వే పనులను పరిశీలన
- సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్



మునిపల్లి, నవంబర్ 12 (జనంసాక్షి):
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల పునఃసర్వే కార్యక్రమంలో భాగంగా మునిపల్లి మండలం మగ్దుంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సర్వే పనులను సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్ బుధవారం పర్యవేక్షించారు.
ఈ సందర్భంగా స్థానిక రైతులతో సమావేశమై పునఃసర్వే లక్ష్యాలు, ప్రయోజనాలపై చర్చించారు. సర్వేకు సంబంధించిన రైతుల సమస్యలు, భూ వివాదాలు, హద్దుల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పునఃసర్వేను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, మండల సర్వేయర్ లాల్‌సింగ్, గ్రామ పంచాయతీ అధికారి రాజు, రైతులు చాంద్ పాషా పటేల్, శేఖర్, మహిపాల్, యాదయ్య, నర్సింలు, శ్రీశైలం, జగదీశ్వర్, ప్రభాకర్, శాంతయ్య, దానందు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన పేదల గోడు పట్టించుకునేదెవరు?

- ఆరు రోజులుగా ధర్నా, పట్టించుకోని నాయకులు, అధికారులు?
- నష్టానికి తగిన పరిహారం చెల్లించాలని బాధితుల డిమాండ్



గుండుమాల్, నవంబర్ 12(జనంసాక్షి): రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు న్యాయమైన పరిహారం చెల్లించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గత ఆరు రోజులుగా గుండుమాల్‌లో బాధిత కుటుంబాలు శాంతియుత ధర్నా నిర్వహిస్తున్నా నాయకులు, అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పి తమ సమస్యను పక్కనపెడుతున్నారని బాధితులు వాపోయారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి జరిగిన నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమగ్రంగా అంచనా వేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టానికి తగిన పరిహారం అందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా గురువారం ఆర్ఐ వెంకట్రాములును కలిసి వినతిపత్రం సమర్పించి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

మాగనూరులో కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏకగ్రీవ ఎన్నిక



మాగనూరు, నవంబర్ 12 (జనంసాక్షి): మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాలు, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి సూచనల మేరకు మండల అధ్యక్షుడు శివరాంరెడ్డి ఆధ్వర్యంలో గురువారం గురురావులింగంపల్లి, తాళంకేరి గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ, యూత్, బీసీ, ఎస్సీ సెల్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
గురురావులింగంపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడిగా రంగమొల్ల లక్ష్మణ్, యూత్ అధ్యక్షుడిగా వర్కూరు ఆంజనేయులు, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎర్ర లక్ష్మణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా హరిజన రమేష్ ఎన్నికయ్యారు.



తాళంకేరిలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా గద్దెగూడెం శ్రీను, యూత్ అధ్యక్షుడిగా టి. వెంకటేష్, బీసీ సెల్ అధ్యక్షుడిగా జి.శేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బి. జగదీష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆనంద్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, దండు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పలువురు ప్రయాణికులకు గాయాలు



తెలకపల్లి, నవంబర్ 12 (జనంసాక్షి): మండలంలోని గౌరెడ్డిపల్లి గ్రామ శివారులో చెరువు కట్ట వద్ద ఈ నెల 11న ఆటో బోల్తా పడి పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. ఎస్సై ఎం. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండనాగుల గ్రామానికి చెందిన నర్సమ్మ (46) బంధువుల ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయిన ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నర్సమ్మకు ఎడమ భుజంతో పాటు శరీరంలోని ఇతర భాగాలకు గాయాలయ్యాయి. మరికొందరు ప్రయాణికులు కూడా గాయపడ్డారు. బాధితుడు జోగు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే ఆర్థిక భద్రత

- కేవైసీ, బీమా, పెన్షన్ పథకాలపై గ్రామస్తులకు అవగాహన



కోహీర్, నవంబర్ 12 (జనంసాక్షి): ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవంలో భాగంగా గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ సేవలు, కేవైసీ నమోదు, బీమా, పెన్షన్ పథకాల ప్రయోజనాలను వివరించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన వారికి నమోదు ప్రక్రియ చేపట్టారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత పొందవచ్చని, చిన్న మొత్తాల్లో పొదుపు చేయాలని సూచించారు. నకిలీ ఫోన్ కాల్స్, ఓటీపీ మోసాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీని ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం సుధీర్ కుమార్, బ్యాంక్ మేనేజర్ శివకుమార్, శ్రీధర్, మోహన్, సంపూర్ణ, మమత, సుధాకర్, నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి నిర్ణయం ఆచితూచి తీసుకోవాలి

- సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాల 25వ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో 90 మందికి పట్టాల ప్రదానం: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి): విద్యార్థులు భవిష్యత్తుకు సంబంధించిన ప్రతి నిర్ణయాన్ని ఆలోచించి, ఆచితూచి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. యువత తీసుకునే నిర్ణయాలే వారి జీవితానికి బలమైన పునాదిగా నిలుస్తాయని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన 25వ గ్రాడ్యుయేషన్ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఫార్మ్-డి పూర్తిచేసుకున్న 90 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కళాశాలలో నేర్చుకున్న క్రమశిక్షణ, విజ్ఞానం, నైపుణ్యాలను వృత్తి జీవితంలో ఆచరణలో పెట్టాలని సూచించారు. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో వ్యక్తుల సామర్థ్యం, పనితీరు, ఫలితాలే ప్రతిభకు కొలమానాలని పేర్కొన్నారు. ఆత్మ విశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.



వచ్చే పదేళ్లు కీలకం...

23 నుంచి 26 ఏళ్ల వయస్సులో ఉన్న విద్యార్థులకు వచ్చే పదేళ్లు జీవితంలో అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇతరుల ఒత్తిడికి, తాత్కాలిక భావోద్వేగాలకు లోనై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. ముఖ్యమైన నిర్ణయాల సమయంలో తల్లిదండ్రులు, గురువులు, శ్రేయోభిలాషుల సలహాలు



తీసుకోవాలని సూచించారు. చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని అన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు దేశ, విదేశాల్లోని ప్రముఖ ఫార్మాస్యూటికల్ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగడం గర్వకారణమన్నారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించి, తాము చదువుకున్న కళాశాలకు, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మంగీలాల్, కార్యదర్శి పద్మలత, చైర్మన్ డాక్టర్ పి.బాలరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ అండ

- వైద్య ఖర్చుల భారాన్ని తగ్గిస్తున్న సీఎం సహాయ నిధి - గోలి శ్రీనివాస్‌రెడ్డి



కల్వకుర్తి, నవంబర్ 13(జనంసాక్షి): పేద,మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు, అనారోగ్యంతోబాధపడుతున్న వారికిఆర్థిక భరోసా కల్పించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ఎఫ్) ఎంతో దోహదపడుతోందని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య ఖర్చులు భరించలేని నిరుపేద కుటుంబాలకు ఈ నిధి వరంగా మారిందని పేర్కొన్నారు.కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామానికి చెందిన ప్రభాతి రామస్వామి అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా, రూ.18 వేల ఆర్థిక సాయం మంజూరైంది. గోలి శ్రీనివాస్‌రెడ్డిసహకారంతో మంజూరైనచెక్కును గురువారం రామస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మండల భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు సింగం విజయ్‌గౌడ్, వెల్దండ మండల అధ్యక్షుడు పుట్ట రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు నాగులు నాయక్, లింగం, రాములు, ఎల్లికల్ సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు సునీత, ఆనంద్, నరేష్, తలకొండపల్లి మండల పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, ప్రవీణ్, రవి, సుమన్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు



మల్దకల్, నవంబర్ 12 (జనంసాక్షి): మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కళా సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, ఏకపాత్రాభినయం, హరికథ, గేయాలాపన, నృత్యాలు ఆకట్టుకున్నాయి. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంపై ప్రదర్శించిన నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సామాజిక అంశాలు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక సంప్రదాయాలపై విద్యార్థులు కళారూపాల ద్వారా సందేశమిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు నాయకత్వ లక్షణాలు, వేదికపై మాట్లాడే సామర్థ్యం, బృంద స్ఫూర్తిని పెంపొందిస్తాయని మండల విద్యాధికారి జి. సురేష్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు యు.రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేర్యాల వ్యవసాయ మార్కెట్‌లో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

- హాజరైన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి



చేర్యాల, నవంబర్ 12 (జనంసాక్షి): చేర్యాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గురువారం చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనగామ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని, కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి అండ



పెద్దకొత్తపల్లి, నవంబర్ 12 (జనంసాక్షి): పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు కల్యాణలక్ష్మి పథకం ఆర్థిక భరోసా కల్పిస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని కల్వకోల్ గ్రామానికి చెందిన చెటమోని లక్ష్మి, సంగం పద్మ అనే ఇద్దరు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి చెక్కులను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పేద కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను తగ్గించడంలో ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్ రెడ్డి మధు, కాటమోని బిచ్చన్న గౌడ్, సుర గౌని శివ గౌడ్, ఎండీ వలి, సాయిరాం యాదవ్, నూనె క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోకుల్ నగర్‌లో ఆర్థిక సమ్మిళిత పథకాలపై అవగాహన సదస్సు

- ప్రభుత్వ బీమా పథకాలతో ఆర్థిక భద్రత



కొత్తపల్లి, నవంబర్ 12 (జనంసాక్షి): కొత్తపల్లి మండలంలోని గోకుల్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సమ్మిళిత పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లింగాల్‌చేడ్ ఐఓబీ బ్రాంచ్ మేనేజర్ రమణ, గ్రామ సర్పంచ్ షేక్ మీరాన్, ఉపసర్పంచ్ రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన పథకాల ప్రయోజనాలను వివరించారు. అలాగే బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం, కేవైసీ నవీకరణ, డిజిటల్ బ్యాంకింగ్ సేవల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో గ్రామ మహిళలు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

లక్ష్మణ్ నాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ





పిర్గాపూర్, నవంబర్ 12 (జనంసాక్షి): మండలంలోని లక్ష్మణ్ నాయక్ తండాలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల పంచాయతీ అధికారి బ్రహ్మయ్య, సర్పంచ్ దురీబాయి విట్టల్ భూమి పూజ నిర్వహించారు. గ్రామానికి కొత్తగా ఐదు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూస్తున్న పేద కుటుంబాల కల నెరవేరనుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. లబ్ధిదారులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దిష్ట గడువులోగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. తండాలో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి దశలవారీగా ఇళ్లు మంజూరు చేయిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు, కార్యదర్శి, తండా పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్దకల్ సింగిల్ విండో చైర్మన్ పదవి బీసీలకు కేటాయించాలి



మల్దకల్, నవంబర్ 12 (జనంసాక్షి): మల్దకల్ మండల సింగిల్ విండో చైర్మన్ నామినేటెడ్ పదవిని బీసీలకు కేటాయించాలని బీసీ కాంగ్రెస్ నాయకులు, మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో బీసీ జనాభా అధికంగా ఉందని, ముఖ్యంగా వాల్మీకి సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సింగిల్ విండో ఏర్పాటైనప్పటి నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులే చైర్మన్లుగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బీసీలకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. పక్కనున్న అలంపూర్ నియోజకవర్గంలో సామాజిక సమతుల్యత పాటిస్తూ సింగిల్ విండో చైర్మన్ పదవులు కేటాయించారని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నామినేటెడ్ విధానంలో పదవుల కేటాయింపునకు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో బీసీ, ఎస్సీ వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని ఆశిస్తున్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు ఘనంగా శ్రీమంతం



నారాయణపేట, నవంబర్ 12 (జనంసాక్షి): నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ శిరీషకు గురువారం పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా శ్రీమంతం నిర్వహించారు. సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహిళా ఎస్ఐ గాయత్రి, సిబ్బంది చీర, పూలు, పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యుల్లా అండగా నిలిచిన పోలీసు సిబ్బందికి శిరీష కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నంచర్ల యువకుడు ఫెరోజ్..

• మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరఫున బరిలోకి..గ్రామస్థుల హర్షం



మహ్మదాబాద్, నవంబర్ 12(జనంసాక్షి): గ్రామీణ క్రీడా ప్రాంగణం నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో చోటుదక్కించుకున్న నంచర్ల గ్రామ యువకుడు మహ్మద్ ఫెరోజ్ తన ప్రతిభను చాటేందుకు సిద్ధమయ్యాడు. ఈ నెల12 నుంచి 14వ తేదీ వరకు వికారాబాద్‌లో నిర్వహించనున్న 36వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామానికి చెందిన ఫెరోజ్ నంచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న సమయంలో పాఠశాల పీడీ అబ్దుల్ బిన్ హమ్మద్ వద్ద కబడ్డీలో ప్రాథమిక శిక్షణ పొందాడు. అప్పటి నుంచి క్రీడపై ఆసక్తిని పెంచుకుంటూ సాధన కొనసాగించాడు.ప్రస్తుతం మహమ్మదాబాద్ ప్రభుత్వ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కబడ్డీ క్రీడలో చురుకుదనం, పట్టుదల, వేగం, వ్యూహాత్మక నైపుణ్యాలతో జిల్లా జట్టులో చోటు దక్కించుకున్న ఫెరోజ్.. రాష్ట్రస్థాయి వేదికపై తన ఆటతీరుతో సత్తా చాటేందుకు ఉత్సాహంగా ఉన్నాడు. గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం పట్ల నంచర్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ..ఫెరోజ్‌కు అభినందనలు తెలియజేశారు.ం

కుళాయి నీటి వృధా చేస్తే కుళాయి కలెక్షన్ కట్

• అయిజ మున్సిపల్ కమిషర్ చంద్రశేఖర రావు



అయిజ, నవంబర్ 12 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి లభ్యత తగ్గి, నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించి, నీటిని పొదుపుగా వాడుకోవాలని ఐజ కమిషనర్ సూచించారు.

మున్సిపల్ అనుమతి లేకుండా కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయరాదని, మున్సిపల్ పైప్‌లైన్‌కు మోటార్లు బిగించి నీటిని తోడితే నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.5,000 జరిమానా విధించబడుతుందని తెలిపారు. వినియోగం పూర్తయిన వెంటనే కుళాయిని బిగించాలి. మున్సిపల్ కుళాయి నీటితో కారు కడిగితే – రూ.5,000, బైక్ కడిగితే – రూ.2,000, ఇంటి ముందు నేలను కడిగితే – రూ.2,000 ప్రతి కుళాయి కనెక్షన్‌కు బిట్ ట్యాప్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. నీటి వృధా లేదా అక్రమ వినియోగం గమనించినట్లయితే మున్సిపల్ నీటి సరఫరా లైన్ మెన్ల విభాగానికి తెలియజేయండి. నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

భగవాన్ బిర్సా ముండా
151వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

• జిల్లావ్యాప్తంగా జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమాలు



కొల్చారం, నవంబర్ 12 (జనంసాక్షి): ఈ నెల 15న నిర్వహించనున్న జనజాతీయ గౌరవ దివస్ సందర్భంగా గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలను మెదక్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు లావడియా రాములు నాయక్ తెలిపారు. జిల్లాలోని ప్రతి తండా, గ్రామం, పట్టణం, మండల కేంద్రంలో ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. రాష్ట్ర ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై వేడుకలతో పాటు భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బిర్సా ముండా పోరాటాలు, త్యాగాలు, గిరిజన హక్కుల కోసం చేసిన ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడమే కార్యక్రమాల ఉద్దేశమన్నారు. జయంతి వేడుకల్లో గిరిజనులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈర్ల రంజిత్ రెడ్డి, కుమార్ నాయక్, పూల్ సింగ్ నాయక్, శివలాల్ నాయక్, రామ్ చందర్ నాయక్, రాంసింగ్ నాయక్ పాల్గొన్నారు.

కొడుకు మరణంతో కూలి తల్లి కుటుంబంలో తీరని విషాదం

• రోడ్డు ప్రమాదంలో 23 ఏళ్ల శివశంకర్ మృతి.. ఆర్థిక సాయం కోసం ఎదురుచూపులు



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి): కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులను చదివించిన తల్లి రుక్మమ్మకు పెద్ద కుమారుడు శివశంకర్ (23) మరణం తీరని విషాదాన్ని మిగిల్చింది. తండ్రి లేని కుటుంబంలో తల్లికి అండగా నిలవాల్సిన శివశంకర్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబం కుప్పకూలింది. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ రుక్మమ్మ తన కుమారులను చదివించింది. శివశంకర్ సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రయోగశాల పరీక్షలకు సంబంధించిన శిక్షణ పొందుతూ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఉద్యోగం సాధించి కుటుంబానికి ఆసరాగా నిలుస్తాడని ఆశించిన తల్లికి కుమారుడి మరణం తీరని శోకాన్ని మిగిల్చింది. ప్రస్తుతం అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా ఆర్థిక స్థోమత లేక కుటుంబం ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం చేయదలచిన వారు రుక్మమ్మ చిన్న కుమారుడిని 6304274149 నంబరులో సంప్రదించాలని కోరారు.

విద్యావంతుల తరఫున ప్రశ్నించే గొంతుకనవ్వతా...

• సమాజంలో మార్పు తేవాలన్న సంకల్పంతో పనిచేస్తా

• గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టీఆర్ఎస్ అభ్యర్థి ఆకాశ్ కొల్లూరి



మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యావంతుల తరఫున ప్రశ్నించే గొంతుకగా నిలుస్తానని హైదరాబాద్–మహబూబ్‌నగర్–రంగారెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టీఆర్ఎస్ అభ్యర్థి ఆకాశ్ కొల్లూరి అన్నారు. గురువారం మహబూబ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

బీసీలు, విద్యావంతులైన యువత రాజకీయాల్లోకి రావాలనే ఉద్దేశంతో పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత తనకు అవకాశం కల్పించారని తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేసిన తాను, నేషనల్ మీడియాలో జర్నలిస్టుగా పనిచేసి పలు స్టింగ్ ఆపరేషన్లు నిర్వహించానని పేర్కొన్నారు. సమాజ సమస్యలపై అవగాహనతో పనిచేస్తానని చెప్పారు.

గతంలో గెలిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు విద్యావంతుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. తాను గెలిస్తే ప్రతిరోజూ ఒక నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ యువత ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు యువత, మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు.

సామాజిక తెలంగాణకు తొలి అడుగు: డాక్టర్ రఘు

ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌ఛార్జి డాక్టర్ రఘు మాట్లాడుతూ సామాజిక తెలంగాణ సాధనలో భాగంగా తమ పార్టీ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు బీసీలకు అవకాశం కల్పించిందన్నారు. కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన ఆకాశ్ కొల్లూరిని గెలిపించాలని కోరారు.

విద్యావంతుల గొంతుకగా నిలుస్తారు: రంజిత్ కుమార్

టీఆర్ఎస్ జిల్లా ఇన్‌ఛార్జి గొంగళ్ల రంజిత్ కుమార్ మాట్లాడుతూ విద్యావంతుల సమస్యలపై ప్రశ్నించి, పోరాడే యువ నాయకుడు ఆకాశ్ కొల్లూరిని గెలిపించాలని కోరారు.

గతంలో గెలిచిన ఎమ్మెల్సీలు విద్యావంతుల సమస్యలను సభలో ప్రస్తావించలేదని విమర్శించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సౌజన్య రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో ప్రెస్ క్లబ్ శంకుస్థాపనకు దూరం

• ఏకపక్ష కార్యక్రమాలను ఖండిస్తున్నాం

• అన్ని జర్నలిస్టు సంఘాలతో నూతన కమిటీ ఏర్పాటు చేస్తాం

• టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా నాయకుల స్పష్టీకరణ



వనపర్తి బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి): వనపర్తి పట్టణంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం వివాదాస్పదంగా ఉన్నందున అక్కడ నిర్వహించనున్న భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలకు తాము దూరంగా ఉంటామని టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షుడు మాధవరావు, కార్యదర్శి బి.రాజు, కోశాధికారి మన్యం, పట్టణ అధ్యక్షుడు అరుణ్ రాజ్ తదితర నాయకులు స్పష్టం చేశారు.

జర్నలిస్టులందరి అభిప్రాయాలు, జర్నలిస్టు సంఘాల సమన్వయం లేకుండా ఒకరిద్దరు వ్యక్తులు ప్రెస్ క్లబ్ పేరుతో ఏకపక్షంగా కార్యక్రమాలు నిర్వహించడం సరైన విధానం కాదని వారు పేర్కొన్నారు. సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ క్లబ్ పేరుతో కొంతమంది రిజిస్ట్రేషన్ చేసుకున్న సంస్థ వారి వ్యక్తిగతమని, దానికి జిల్లాలోని జర్నలిస్టులందరికీ సంబంధం లేదని తెలిపారు. ఇప్పటికే వనపర్తిలో రెండు ప్రెస్ క్లబ్‌లు ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. త్వరలో అన్ని జర్నలిస్టు సంఘాలను కలుపుకొని నూతన ప్రెస్‌క్లబ్ కమిటీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తూ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మెగా రెడ్డికి జర్నలిస్టుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఎలాంటి వివాదాలకు తావులేని స్థలాన్ని ఎంపిక చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు. గతంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రెస్ క్లబ్ భవనం జర్నలిస్టులందరికీ ఉపయోగపడేలా ఉండాలని, అన్ని సంఘాల ప్రతినిధులతో చర్చించి, అందరి ఆమోదంతో నిర్మాణ పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

ఏకపక్ష నిర్ణయాలతో జర్నలిస్టుల మధ్య విభేదాలు సృష్టించవద్దని, ఐక్యతను కాపాడాలని కోరారు. జర్నలిస్టులను రాజకీయాలకు పావులుగా వాడుకోవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో 350కు పైగా, వనపర్తి పట్టణంలో పందకు పైగా సభ్యత్వాలు కలిగిన సంఘంగా ఈ విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

ఈ ప్రకటనలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఆంజనేయులు సాగర్, నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్, కోశాధికారి సురేష్, సీనియర్ పాత్రికేయులు నాగేంద్రం చారి, ఆంధ్రప్రభ స్టాఫ్ రిపోర్టర్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ వర్కర్లను PRCలోకి తీసుకురావాలి - GP JAC డిమాండ్



ఆత్మకూర్, నవంబర్ 12 (జనంసాక్షి): గ్రామపంచాయతీ కార్మికులను ఈసారి PRCలోకి తీసుకొచ్చి జీతాలు పెంచాలని, కనీస వేతనం రూ.30 వేలు ఇవ్వాలని కోరుతూ TUCI, CITU, AITUC అనుబంధ గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు గురువారం సచివాలయంలో గ్రామపంచాయతీ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ కు వినతిపత్రం అందజేశారు. అనేక సంవత్సరాలుగా కనీస వేతనాలకు నోచుకోకుండా శ్రమ దోపిడీకి గురవుతున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ఈ సందర్భంగా వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామపంచాయతీలలోని వర్కర్లందరికీ PF, ESI, గ్రాట్యుటీ చట్టాలు అమలు చేయాలని, ప్రమాద మరణానికి రూ.20 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ గ్రామపంచాయతీల ద్వారా కట్టించాలని డిమాండ్ చేశారు.



జీవో 51ను రద్దుచేసి పాత కేటగిరీలను కొనసాగించాలని, కారోబర్లకు సహాయ కార్యదర్శిగా అవకాశం కల్పించాలని కోరారు. 2026 జనాభా లెక్కల ప్రకారం వర్కర్ల సంఖ్యను పెంచాలని, ప్రభుత్వం నమోదు చేయని సుమారు 10 వేల మంది పేర్లను వెంటనే నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా గ్రీన్ ఛానల్ ద్వారా అందరికీ జీతాలు చెల్లించాలని, ముఖ్యమంత్రి హామీని వెంటనే అమలు చేయాలని, గ్రామపంచాయతీ వర్కర్లకు డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అక్రమ తొలగింపులు ఆపాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు వర్కర్లందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (TUCI) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అరుణ్ కుమార్, రాష్ట్ర కోశాధికారి చంద్రములు, CITU GP రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, రాష్ట్ర నాయకురాలు యాదమ్మ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు టి.నరసింహారెడ్డి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో నకిలీ వైద్యులపై తెలంగాణ వైద్య మండలి దాడులు

- మూడు వైద్యశాలలపై తనిఖీలు
- బీఏ, పదవ తరగతి, ఇంటర్ చదివి వైద్యం చేస్తున్న ముగ్గురు గుర్తింపు
- అర్హత లేకుండా వైద్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక





మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 12 (జనంసాక్షి): ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా తెలంగాణ వైద్య మండలి మహబూబ్‌నగర్‌లో మూడు వైద్యశాలలపై మంగళవారం తనిఖీలు నిర్వహించింది.

తనిఖీ చేసిన వైద్యశాలలు షిఫా వైద్యశాల – ఎం.ఏ. ఆరిఫ్ (బీఏ అర్హత మాత్రమే), మస్దూస్ నగర్ ఎక్స్ రోడ్ ఏ.కె. ప్రథమ చికిత్స కేంద్రం –మహ్మద్ అబిద్ హుస్సేనీ (పదవ తరగతి మాత్రమే), దొడ్డలోనిపల్లి, పిల్లలమర్రి రోడ్, యాదగిరి వైద్యశాల – యాదగిరి (ఇంటర్మీడియట్ మాత్రమే), బోయపల్లి గుర్తింపు పొందిన వైద్య విద్యార్హతలు, నమోదు లేకుండా వైద్య సేవలు అందించడం ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు అని మండలి ఆందోళన వ్యక్తం చేసింది.

ఈ తనిఖీల్లో తెలంగాణ వైద్య మండలి అధ్యక్షులు డా. మహేష్ కుమార్ కె, డా. రఘు రెడ్డి, డా. పురం గిరి రాజా పాల్గొన్నారు. వైద్య వృత్తిని కేవలం గుర్తింపు పొందిన అర్హత, చెల్లుబాటు అయ్యే నమోదు కలిగిన వైద్యులు మాత్రమే నిర్వహించాలని తెలంగాణ వైద్య మండలి స్పష్టం చేసింది.

చికిత్స పొందే ముందు వైద్యుల నమోదు వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

కల్వకుర్తి జూనియర్ సివిల్ జడ్జిగా ఆర్. శరణ్య బాధ్యతల స్వీకరణ

- బదిలీపై వెళ్తున్న ఎన్. శ్రీనిధికి బార్ అసోసియేషన్ ఘన వీడ్కోలు

కల్వకుర్తి, నవంబర్ 13(జనంసాక్షి): కల్వకుర్తి కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా ఆర్. శరణ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొల్లాపూర్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన ఆమె బదిలీపై కల్వకుర్తికి వచ్చారు. ఈ సందర్భంగా కల్వకుర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన జడ్జికి ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా బదిలీపై నాగర్‌కర్నూల్‌కు వెళ్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఎన్. శ్రీనిధికి ఘనంగా వీడ్కోలు పలికారు. గత ఏడాది కాలంగా కల్వకుర్తి కోర్టుకు పూర్తిస్థాయి జడ్జి లేకపోవడంతో నాగర్‌కర్నూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎన్. శ్రీనిధి ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా ఆర్. శరణ్య బాధ్యతలు చేపట్టడంతో కోర్టుకు పూర్తిస్థాయి జడ్జి అందుబాటులోకి వచ్చారు.





ఈ సందర్భంగా జడ్జి ఆర్. శరణ్య మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కేసుల పరిష్కారంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు సహకరించాలని కోరారు. బదిలీపై వెళ్తున్న జడ్జి ఎన్. శ్రీనిధి మాట్లాడుతూ కల్వకుర్తి కోర్టులో విధులు నిర్వహించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. న్యాయమూర్తి విధి నిర్వహణలో కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించడం ముఖ్యమని పేర్కొన్నారు. తనకు సహకరించిన న్యాయవాదులు, కోర్టు సూపరింటెండెంట్, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. మల్లేష్, ప్రధాన కార్యదర్శి జమీల్ అహ్మద్, ఉపాధ్యక్షుడు ఎం. నాగరాజు, కోశాధికారి బి. ప్రశాంత్, సీనియర్ న్యాయవాదులు వి. వెంకటరెడ్డి, వి. లక్ష్మణ శర్మ, ఏ. వెంకటేశ్వరరావు, జె. లక్ష్మీనారాయణ, జి. వెంకట్ గౌడ్, సి. కృష్ణయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే. వెంకటరమణ, కోర్టు సూపరింటెండెంట్ సత్యం, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

యాసంగిలో తక్కువ నీటి పంటల సాగుకే ప్రాధాన్యత ఇవ్వాలి

- ఫార్మర్ రిజిస్ట్రీ ప్రతి రైతు తప్పనిసరిగా చేయించుకోవాలి
- శనగ, తెల్ల కుసుమ, చిరుధాన్యాల సాగుతో నీటి వినియోగం తగ్గించుకోవాలి

కోహీర్, నవంబర్ 12 (జనంసాక్షి):

యాసంగి సీజన్‌లో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోహీర్ మండల వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో సాగు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు.

కోహీర్ మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా నవంబర్ 12న వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ ప్రగతి నివేదికను వెల్లడించారు. యాసంగి పంటల సాగు, విత్తనాలు, ఎరువుల లభ్యత, ఫార్మర్ రిజిస్ట్రీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించారు. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులకు శనగ, కుసుమ విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

అన్ని రకాల ఎరువులను యాప్ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యం ఉందని, అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కోహీర్ మండలాన్ని ప్రభుత్వం తీవ్ర కరువు మండలంగా గుర్తించినట్లు నివేదికలో వెల్లడించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు విషయంలో రైతులు నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. శనగ, తెల్ల కుసుమ, చిరుధాన్యాలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి...

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.



ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద అర్హులైన రైతులకు ఏడాదికి రూ.6 వేల ఆర్థిక సాయం మూడు విడతల్లో అందుతుందని తెలిపారు. నమోదు కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో మీ–సేవ కేంద్రాలను లేదా వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా ఎరువులు, విత్తనాల సరఫరాతో పాటు పీఎం కిసాన్, రైతు భరోసా, పంటల కొనుగోలు తదితర ప్రభుత్వ పథకాలు, సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే మండలంలోని ప్రతి గ్రామంలో వాలంటీర్ల ద్వారా పంటల నమోదు ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు.

రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని అధికారులు కోరారు.

సైబర్ మోసం.. లక్ష మాయం



మల్దకల్, నవంబర్ 12(జనంసాక్షి): మండల పరిధిలోని పెద్ద తాండ గ్రామానికి చెందిన సురేష్ నాయక్ సైబర్ మోసానికి గురై లక్ష రూపాయలు కోల్పోయారు. సురేష్ నాయక్ గత ఆరు సంవత్సరాలుగా హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కూలీలకు డబ్బులు చెల్లించేందుకు తన బ్యాంకు ఖాతాను పరిశీలిస్తున్న సమయంలో ఒక మెసేజ్ రావడంతో, సైబర్ నేరగాళ్లు ఆయన ఖాతా నుంచి లక్ష రూపాయలు మాయం చేసినట్లు బాధితుడు తెలిపారు. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి సంపాదించిన డబ్బులు సైబర్ మోసగాళ్ల చేతిలో పోవడంతో బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి,సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయడంతో పాటు పోగొట్టుకున్న డబ్బులు తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సురేష్ నాయక్ పోలీస్ అధికారులు కోరుతున్నారు.

ఆరుతడి పంటల సాగుపై గ్రామసభలో చర్చ

- నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి: సర్పంచ్ అరుణారెడ్డి



శివ్వంపేట, నవంబర్ 12 (జనంసాక్షి): తాగు, సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సర్పంచ్ దొంతిరెడ్డి అరుణారెడ్డి, అధికారులు సూచించారు. సికింద్లాపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాల తగ్గుదలపై చర్చించారు. వరి సాగుతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు. వీబీజీ రాంజీ పథకం కింద కూలీలకు 200 రోజుల పని కల్పించాలని కోరారు. భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు, బోరుబావుల వద్ద పాంపొండ్లు నిర్మించాలని సూచించారు. అనంతరం ఎండిన వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, ఎంపీవో తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 46 మందికి ఉద్యోగాలు

- 173 మంది అభ్యర్థుల హాజరు
- నాలుగు సంస్థల్లో ఉద్యోగాల ఎంపిక





సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి): జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు వివిధ విద్యార్హతలు కలిగిన 173 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 46 మంది అభ్యర్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సంస్థల వారీగా ఫాక్స్‌కాన్‌లో 35 మంది, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ముగ్గురు, నెక్ట్ క్లిక్‌లో ముగ్గురు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఐదుగురు ఎంపికయ్యారు. నిరుద్యోగ యువత రానున్న ఉద్యోగ మేళాలు, ఉద్యోగ అవకాశాల వివరాల కోసం 'దీఈఈ సంగారెడ్డి' ఇన్‌స్టాగ్రామ్ ఛానల్‌ను అనుసరించాలని జిల్లా ఉపాధి అధికారి రవికిరణ్ రెడ్డి సూచించారు.

జడ్చర్లలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పర్యటన

- నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలి



జడ్చర్ల, నవంబర్ 12 (జనంసాక్షి): జడ్చర్ల మండల, మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు, విద్యాసంస్థల పారిశుధ్య నిర్వహణ ను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఎస్సీ సంక్షేమ వసతి గృహ పనులను



పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలతో పెం డింగ్ పనులను గడువులోగా పూర్తి చేయా లని కాంట్రాక్టర్లను ఆదేశించారు. వల్లూరు జడ్పీహెచ్ఎస్, ప్రభుత్వ బాలికల జూని యర్ కళాశాలను సందర్శించి తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌక ర్యాలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలిం చారు. ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గిరీష్‌తో కలిసి పట్టణంలో కోతుల పట్టివేత కార్యక్రమాన్ని పరిశీలించి, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ కొనసాగించా లని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

మద్దకల్, నవంబర్ 12 (జనంసాక్షి): మండల కేంద్రంలోని పెద్ద రామన్నకు చెందిన ఇందిరమ్మ ఇల్లును గురువారం గద్వాల ఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.గద్వాల నియోజకవర్గంలో మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం చేశారు. దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొనిగృహ ప్రవేశాలు చేసుకోవా లని,ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డితో సాధ్యమైనది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, మాజీ ఎంపీపీరాజారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న,సర్పంచ్ చిట్టెమ్మ, నాయకులు వెంకటన్న, మైలగడ్డ చంద్రశేఖర్, నల్లారెడ్డి, నరసింహులు,మధు,మాజీ సర్పంచ్ కొంకతి నరేందర్,రాముడు, ఉప్పరినారాయణ,మహేష్, యాకోబు,లక్ష్మన్న,బద్రి, గోపాల్,తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ కు రెగ్యులర్ జడ్జి... ఎన్నో ఏళ్ల కల...

- ఘనంగా సత్కరించి స్వాగతం పలికిన న్యాయవాదులు



మక్తల్, నవంబర్ 12 (జనంసాక్షి): మక్తల్ కోర్టుకు రెగ్యులర్ జడ్జిగా కాసర్ల అవినాష్ నియా మకం కావడంతో... మక్తల్ న్యాయవాదులు ఆయనకు గురువారం ఘనంగా స్వాగతం పలి కారు. మక్తల్ కోర్టు అడ్ హక్ కమిటీ అధ్యక్షుడు తిమ్మన్న పూలబొకే ఇచ్చి జడ్జికి స్వాగతం పలి కారు. అనంతరం మక్తల్ న్యాయవాదులు, నారాయణపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జి అవినాష్ ను శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... మక్తల్ రెగ్యులర్ రావడంతో చుట్టుపక్కల దాదాపు 50 పైగా గ్రామాల ప్రజల ఇబ్బందులు దూరమయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. నారాయణపేటతో పోల్చితే మక్తల్ లోనే కేసులు ఎక్కువ అని, రెగ్యులర్ జడ్జి రాకతో కేసుల పరిష్కారం మరింత వేగవంతం కానుందని తెలిపారు. కార్యక్రమంలో మక్తల్ న్యాయవాదులు, నారాయణపేట బార్ అసోసియే షన్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత: కృష్ణ ఎస్సై.నవీద్



కృష్ణ, నవంబర్ 12 (జనంసాక్షి): కృష్ణ మండల పరిధిలోని కున్సి గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలి స్తున్న టిప్పర్‌ను టాస్క్ ఫోర్స్ ,కృష్ణ పోలీసులు పట్టుకున్నారు. కెఎ33సి0059 నంబర్ గల టిప్పర్‌లో ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి, వాహనాన్ని స్వాధీనం చేసుకొని యాధిర్ కు చెందిన డ్రైవర్ మల్లికార్జున్‌తో పాటు వాహన యజమాని మంజునాథపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టప్రకా రం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నవీద్ హెచ్చరించారు.

ఆత్మకూరులో ఘనంగా రాజీవ్ గాంధీ విగ్రహ ప్రతిష్ఠ



ఆత్మకూర్, నవంబర్ 12 (జనంసాక్షి): రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సూచన మేరకు ఆత్మకూర్ పట్టణం లోని పీజేపీ క్యాంపు, జూరాల క్రాస్ రోడ్డు వద్ద మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహిం చారు. ఈ విగ్రహాన్ని దివంగత గాజుల ఉస్మాన్ కుటుంబ సభ్యులు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండీ రహమతుల్లా, మున్సిపల్ చైర్మన్ నాగమణి, వైస్ చైర్మన్ నల్గొండ శీను, తులసి రాజ్ యాదవ్, నాగేష్, ఈర్లదిన్నె శీను, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.6.5 కోట్లతో చుక్కాయిపల్లి ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులు

- శంకుస్థాపన చేసిన మంత్రి జూపల్లి



నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 11(జనంసాక్షి): నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని చుక్కాయిపల్లి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ. 6.5 కోట్ల నిధులతో చేపట్టనున్న సుందరీకరణ పనులకు పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొల్లాపూర్ ప్రాంతా నికి చుక్కాయిపల్లి చెరువు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. చెరువు పరిసరాలను సుందరీకరించి, ప్రజ లకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.
తెలంగాణలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోం దని, రాష్ట్రంలోని ప్రకృతి అందాలు, జలవనరులు, చారిత్రక కట్ట డాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని పేర్కొ న్నారు. పర్యాటక అభివృద్ధి ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభి స్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కొల్లాపూర్ ప్రాంతానికి పర్యాటకంగా మరింత గుర్తింపు తీసుకురావడానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.చుక్కాయిపల్లి చెరువు మినీ ట్యాంక్ బండ్‌గా రూపుదిద్దుకుంటే కొల్లాపూర్ పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రం అందుబాటులోకి రానుంది. ఈ అభి వృద్ధి పనులు పూర్తయితే పట్టణ సుందరీకరణకు వన్నె చేకూరనుంది.

ఫుట్‌పాత్ ఆక్రమణదారులపై కఠిన చర్యలు

- రోడ్డు మార్జిన్ మార్కింగ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: కమిషనర్ రమేష్ కుమార్
- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వాహనాలు స్వాధీనం: ఎస్ఐ గంగరాజు



తూప్రాన్, నవంబర్ 12 (జనంసాక్షి): తూప్రాన్ మున్సిపల్ పరిధిలో ప్రధాన రహదారిపై ఫుట్‌పాత్‌లు, రోడ్డు మార్జిన్లు, ప్రజా రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, ఎస్ఐ గంగరాజు హెచ్చరించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, పాదచారులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రహదారికి ఇరువైపులా రోడ్డు



మార్జిన్లను గుర్తించి మార్కింగ్ చేసినట్లు పేర్కొన్నారు. వ్యాపారులు తమ దుకాణాలు, వస్తువులు, ఇతర కార్యకలాపాలను నిర్దేశించిన హద్దుల్లోనే నిర్వహించాలని సూచించారు. మార్కింగ్‌కు విరుద్ధంగా వస్తువులు ఉంచినా, నిర్మాణాలు చేపట్టినా లేదా ఇతర ఆక్రమణలకు పాల్పడినా వాటిని తొలగించి మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకుంటామని హెచ్చరించారు. పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ లను వ్యాపార అవసరాలకు వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రధాన రహదారి వెంబడి దుకాణాలు, వీధి వ్యాపా రుల వద్దకు వచ్చే వాహనాలు కూడా నిర్దేశిత మార్జిన్ హద్దులను పాటించాలని ఎస్ఐ గంగరాజు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే పోలీస్ శాఖ వాటిని స్వాధీనం చేసుకొని చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.
రహదారులపై అడ్డంకులు సృష్టించే వారిపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.
ప్రజా రహదారులు, ఫుట్‌పాత్‌లు అందరి సౌకర్యార్థం ఉన్నాయని, వాటిని ఆక్రమించడం సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీ, పోలీస్ శాఖ నిబంధనలను పాటించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మావా ఆసుపత్రిపై వైద్య ఆరోగ్య శాఖ కొరడా..!

- నిబంధనల ఉల్లంఘనపై ఆసుపత్రి సీజ్
- రెండు నెలల పసికందు మృతి ఘటన నేపథ్యంలో చర్యలు



కోహీర్, నవంబర్ 12 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణంలోని మావా ప్రైవేట్ ఆసుపత్రిపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతా రామరాజు గురువారం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేశారు. ఇటీవల ఇదే ఆసుపత్రిలో రెండు నెలల పసికందు మృతి చెందిన ఘటన నేపథ్యంలో ఈ చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.
ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రెండు నెలల చిన్నారి మృతి చెందడంతో తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఆసుపత్రి వైద్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.
ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆసుపత్రిని సంద ర్శించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, నిర్వహణ తీరు, వైద్య సిబ్బంది వివరాలు, ప్రభుత్వ అనుమతులు తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల అనంతరం ఆసుపత్రిని సీజ్ చేస్తూ డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారామరాజు చర్యలు తీసుకున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులపై పర్యవేక్షణ పెంచాలి...

పసికందు మృతి ఘటనతో వివాదంలో ఉన్న ఆసుపత్రిపై అధికారులు చర్యలు తీసుకోవడం పట్టణంలో చర్చనీయాంశమైంది.
అయితే ఆసుపత్రిని సీజ్ చేయడానికి అధికారులు గుర్తించిన నిర్దిష్ట కారణాలు, తనిఖీల్లో బయటపడిన లోపాలపై పూర్తి అధికారిక వివరాలు వెల్లడికావాల్సి ఉంది.
ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవలు అందిస్తున్నాయో లేదో అధికారులు నిరంతరం పర్యవేక్షించా లని పట్టణ ప్రజలు కోరుతున్నారు.
రోగుల ప్రాణాలకు ముప్పు కలిగించే నిర్లక్ష్య ధోరణులను అరికట్టి, నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఖమ్మంలో బాలోత్సవ్ హోరు... చిన్నారుల సృజనకు రాష్ట్రస్థాయి వేదిక



- ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా తుమ్మల యుగంధర్
- నిర్వాహకుల సామర్థ్యానికి నిదర్శనంగా అనూహ్య స్పందన



ఖమ్మం, (జనంసాక్షి): చిన్నారుల కేరింతలు, చిందుల సందడితో భక్త రామదాసు కళాక్షేత్రం మార్మోగింది. రెండు రోజులుగా కళకళలాడిన రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ గురువారం రాత్రి ఘనంగా ముగిసింది. వారధి ఫౌండేషన్, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకలు ఖమ్మం ప్రతిష్ఠను మరింత పెంచాయని తెలంగాణ కాంగ్రెస్ యువ నాయకుడు తుమ్మల యుగంధర్ అన్నారు.



ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేసిన ఆయన మాట్లాడుతూ, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బాలోత్సవ్‌కు అనూహ్య స్పందన రావడమే నిర్వాహకుల సామర్థ్యానికి అద్దం పడుతోందన్నారు. 'చిన్నారుల్లో దాగిన సృజనను వెలికితీయడానికి ఇలాంటి వేదికలు ఎంతో దోహదపడతాయి. పోటీలు వారిలో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంచుతాయి. కళా ప్రదర్శనలు సహకార గుణాన్ని, క్రమశిక్షణను, పోటీతత్వాన్ని నేర్పు తాయి' అని పేర్కొన్నారు. వారధి ఫౌండేషన్ చైర్మన్, బాలోత్సవ్ నిర్వాహకుడు చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ, పిల్లల్లోని ప్రతిభను వెలికితీయాలనే సంకల్పంతో ప్రతిష్ఠాత్మకంగా, సాహసోపేతంగా ఈ వేడుకలు చేపట్టామన్నారు. ప్రతి చిన్నారిలో ఏదో ఒక కళ ఉంటుందని, దాన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇళ్లలో తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.

ఈ విజయం ఎంతో సంతృప్తినిచ్చిందని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయస్థాయిలోనూ బాలోత్సవ్‌లు నిర్వహించేందుకు ప్రేరణనిచ్చిందని తెలిపారు.

లయ తప్పని అడుగులు.. ఆలోచింపజేసిన వేషాలు

రెండో రోజు సంప్రదాయ, జానపద గ్రూప్ నృత్య పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. సంప్రదాయ వస్త్రధారణతో, ప్రాపర్టీలతో పాటకు తగ్గట్టు లయబద్ధంగా అడుగులు వేస్తూ సభా ప్రాంగణాన్ని ఉర్రూతలూగించారు. భారీ డిజిటల్ తెరపై, విద్యుత్ దీపాల వెలుగుల్లో తమ బిడ్డల నృత్యాలను తిలకించిన తల్లిదండ్రులు మురిసిపోయారు. ఇంత పెద్ద వేదికపై పిల్లల ప్రదర్శనలు చూసి మంత్రముగ్ధులయ్యారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చిన్నారులు ఎల్‌నినో, కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ ఇతివృత్తాలతో ఆలోచింపజేశారు. భగత్ సింగ్, వీరనారి రాణి రుద్రమదేవి, శ్రీ వెంకటేశ్వర స్వామి, సైనికుడు, రైతు, రాకెట్ వేషాలతో అలరించారు. వీరికి స్మార్ట్ కిడ్జ్ స్కూల్ డైరెక్టర్ చింతనిప్పు సుకన్య ప్రశంసా పత్రాలు అందజేశారు. సంప్రదాయ, జానపద నృత్యాలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో గెలుపొందిన సీనియర్, జూనియర్ విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు, తల్లిదండ్రులకు, అతిథులకు నిర్వాహకులు షడ్రుచుల విందు భోజనం ఏర్పాటు చేశారు. నెల రోజులుగా పడిన శ్రమకు చిన్నారుల నుంచి విశేష స్పందన లభించడంతో నిర్వాహకుల్లో ఆనందం వెల్లివిరిసింది. కార్యక్రమంలో బ్లూమింగ్ మైండ్ స్కూల్ కరస్పాండెంట్ అశోక్ రెడ్డి, డాక్టర్ రాధికా రాణి, కొల్లి కల్పన, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయల్ నాగరాజు, జిల్లా నాయకులు చిక్కుళ్ల వెంకటేశ్, పగిళ్లపల్లి రాజు, ప్రసాద్, రాజేశ్, భవానీ శంకర్, ముఖేశ్, నాని, సతీశ్, సంతోషి తదితరులు పాల్గొన్నారు. వేడుకలు, బహుమతి ప్రదానోత్సవాన్ని వీరే పర్యవేక్షించారు.

కొందుర్గు
గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది నిర్వాకం..

- వినియోగదారులపై దురుసు ప్రవర్తన!
- నిబంధనలు గాలికి వదిలేస్తున్న సిబ్బంది

కొందుర్గు, (జనంసాక్షి):

కొందుర్గు మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ 'భవాని ఏజెన్సీ' సిబ్బంది తీరుపై వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ల పంపిణీ విషయంలో సిబ్బంది కనీస మర్యాద లేకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఏజెన్సీ వద్దకు వచ్చిన వినియోగదారులే స్వయంగా ఖాళీ సిలిండర్లను గోడౌన్ లోపల పెట్టి, నిండు సిలిండర్లను బయటకు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సిబ్బంది ఏమాత్రం సహకరించడం లేదని పలువురు వాపోతున్నారు సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రశ్నించిన వినియోగదారుల పట్ల వారు కఠినంగా వ్యవహరిస్తున్నారు. "నీ ఇష్టం ఉంటే తీసుకో, లేదంటే వెళ్లు" అంటూ సమాధానం ఇస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన గ్యాస్ సిలిండర్ ధర రూ. 994 కాగా, ఏజెన్సీ సిబ్బంది వినియోగదారుల వద్ద రూ. 1000 వసూలు చేస్తున్నారు. అదనంగా రూ. 6 ఎందుకు తీసుకుంటున్నారని అడిగితే సరైన సమాధానం చెప్పకుండా చిల్లర లేవంటూ దాటవేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

భవాని గ్యాస్ ఏజెన్సీపై గతంలోనూ ఇలాంటి అనేక ఆరోపణలు వచ్చాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సిబ్బంది ఆడిందే ఆటగా, పాడిందే పాటగా మారిందని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

గ్యాస్ వినియోగదారుల నిబంధనల ప్రకారం సిలిండర్‌ను వినియోగదారుడి ఇంటి వద్దకే నేరుగా డెలివరీ చేయాలి. గోడౌన్ వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన అవసరం లేదు. బిల్లుపై ముద్రించిన ధర మాత్రమే చెల్లించాలి.

డెలివరీ బాయ్స్‌కు అదనంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన పనిలేదు. సిలిండర్ తీసుకునే ముందే దానిపై ఉన్న సీల్ సరిగ్గా ఉందో లేదో, అలాగే సిలిండర్ తూకం కచ్చితంగా ఉందో లేదో తనిఖీ చేసుకునే హక్కు వినియోగదారుడికి ఉంటుంది. సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా లేదా అదనపు డబ్బులు వసూలు చేసినా వెంటనే ఇండియన్ ఆయిల్ టోల్ ఫ్రీ నంబర్ 1800-2333-555 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

తొమ్మిది ప్రాంతాల్లో రూ.3.48 కోట్లతో అభివృద్ధి పనులు

- సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి



అల్వాల్, నవంబర్ 12 (జనంసాక్షి): మల్కాజిగిరి నియోజకవర్గంలోని యాప్రాల్-కౌకూర్, మచ్చ బొల్లారం డివిజన్ల పరిధిలో రూ.3.48 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు.

అల్వాల్, మల్కాజిగిరి సర్కిళ్ల ఇంజినీరింగ్ అధికారులతో కలిసి భూమిపూజ నిర్వహించారు.

యాప్రాల్‌లోని దేవి కల్యాణ్ ఎస్టేట్‌లో రూ.63.50 లక్షలు, శైలి గార్డెన్స్‌లో రూ.44.50 లక్షలు, రాక్ గార్డెన్స్‌లో రూ.62 లక్షలు, సాయికృష్ణ ఎన్‌క్లేవ్ ఫేజ్-1లో రూ.33 లక్షలు, టావిష ఎలైట్‌లో రూ.11 లక్షలు, అండాల్ హోమ్స్‌లో రూ.16 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నారు.

జీకే హ్యాబిటాట్‌లోని పెద్దో-2 పార్కుకు రూ.44 లక్షలు, కౌకూర్‌లోని మల్లారెడ్డి ఎక్స్‌టెన్షన్, పద్మావతి కాలనీల్లో రోడ్లకు రూ.44 లక్షలు, మచ్చ బొల్లారం పంచశీల కాలనీ రోడ్ నంబరు 15లో పార్కు అభివృద్ధికి రూ.30 లక్షలు కేటాయించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..

కాలనీల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తున్నామని తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో డీఈలు మహేష్, పద్మలత, ఏఈలు రవళి, సత్యలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు జేఏసీ సురేందర్‌రెడ్డి, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, మధుసూదన్‌రెడ్డి, చిందం శ్రీనివాస్, ఇతర నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

- విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కాప్రా, నవంబర్ 12 (జనంసాక్షి):

భారత స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప విద్యావేత్త, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను మౌలాలి లక్ష్మీనగర్‌లోని 786 ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి మౌలానా ఆజాద్ చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకుని, భవిష్యత్ తరాలకు విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని, విద్యారంగ అభివృద్ధికి, జాతీయ సమైక్యతకు, మతసామరస్య పరిరక్షణకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ నాయకులు, ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని మౌలానా ఆజాద్‌కు ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమాన్ని మెదక్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం చైర్మన్ జనాబ్ మీర్జా అజీజుల్లా బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.